
పెన్ పవర్
తెలంగాణ రౌండప్





బౌరంపేట్ సర్వే నెంబర్ 472 ప్రభుత్వ భూమిలో 284, ప్లాట్లతో కబ్జాదారుల లేఅవుట్..

# ప్రభుత్వ భూమికి రక్షణేదీ..?

# కబ్జాదారులకు అడ్డేదీ..?

## కాగితాలపైనే 'లేఅవుట్-నోటరీలు'..! హౌసింగ్ బోర్డు భూమిలో ప్లాట్ల విక్రయాలు..!

2024 జూలై 31నాడు.. మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ సందర్శించిన.. (ఫైల్‌ఫోటో)




- బౌరంపేట్ సర్వే నెంబర్:472 ప్రభుత్వ భూమి మొత్తం 31.34 ఎకరాలు..
- సబ్ స్టేషన్‌కు 10. ఎకరాలు, హౌసింగ్ బోర్డుకు 21. ఎకరాలు కేటాయింపు..
- ఇంకా 00.34 గుంటలు అగ్రికల్చర్ ఆక్రమణలో ఉన్నట్టు రెవెన్యూ రికార్డుల్లో..
- ఇదే స్థలాన్ని 2024లో అడిషనల్ కలెక్టర్, ఆర్డీవో సందర్శించి, పరిశీలించారు..
- గతంలో గదులు నిర్మంచగా, దుండిగల్ రెవెన్యూ అధికారుల కూల్చివేత..
- రాత్రి సమయాల్లో టిప్పర్లతో నింపిన మట్టి కుప్పలు దర్శనం..
- కబ్జాల నియంత్రణ కోసం "జిపిఓ"లు, స్థానిక విఆర్ఏలు పర్యవేక్షణ లేమి..
- నిజాంపేట్ 'ఆర్‌జికే' పేదలకు, ప్లాట్‌లు విక్రయిస్తున్నట్టు ఆరోపణలు..
- త్వరలో బోర్డు పెడతామని చెపుతున్న హౌసింగ్ బోర్డు డీఈ..!

- ప్రభుత్వ భూమిలో దర్జాగా లేఅవుట్..!రెవెన్యూ సోల్డ్ ఔట్..?
- సుమారు రూ.150 కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమిలో..! దర్జాగా లేఅవుట్..!
- హౌసింగ్ బోర్డుకు కేటాయించిన భూమిలో చాటు మాటున ప్లాట్‌ల విక్రయాలు..
- అమాయకులను టార్గెట్ చేస్తూ, నోటరీలపై ప్లాట్‌లు విక్రయిస్తున్న కబ్జాదారులు..!
- కలర్ ఫుల్ లేఅవుట్‌ను చూపి మాయ చేస్తున్న కేటుగాళ్ళు..
- ఇప్పటికే చాలా వరకు ప్లాట్‌లు అమ్మినట్లు సమాచారం, బాధితుల్లో ఆర్జీకే వాసులు..?
- అధికారులు అప్రమత్తం కాకపోతే..! మోస పయేది పేదలే..బి-అలర్ట్..!
- ప్లాట్‌ల విక్రయాలపై' టిజిహెచ్‌బి, రెవెన్యూ నిఘా అవస్యం..

ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసమే 'జిపిఓ'ల నియామకమని గొప్పలు చెప్పిన దుండిగల్ తహశీల్దార్, అక్రమ నిర్మాణాల నియంత్రణలో విఫలమవుతున్నారని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి..! నిత్యం ఫీల్డ్‌లో తిరుగుతున్న రెవెన్యూ సిబ్బందికి, ప్రభుత్వ భూముల్లో కబ్జాలు,ఈ లేఅవుట్‌లు, ప్లాట్‌ల విక్రయాలు తెలుసుకోలేక పోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కొందరు రెవెన్యూ సిబ్బంది, స్థానికులే కావడం వలన,చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా లేకపోలేదు.. ఇదే స్థలాన్ని సరిగ్గా మూడేళ్ళ క్రితం "2024 జూలై 31"న స్థానిక తహశీల్దార్ మతీన్, ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్‌తో కలిసి, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, బౌరంపేట్ సర్వే నెం.472 ప్రభుత్వ భూమిని సందర్శించారు.. అయితే అప్పటికే 4 గదులు కూల్చేసిన ఇటుకలు కూడా ఫొటోలో చూడవచ్చు.. అప్పటి నుండి అక్రమ నిర్మాణాలు లేకపోయినా, ఒక లేఅవుట్ సృష్టించి, ప్రస్తుతం ఓవ్యక్తి అంతర్గతంగా ప్లాట్‌లు విక్రయిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.. ఓ సందర్భంలో ప్లాట్ కొనుగోలు చేసిన ఓ మహిళ, తన ప్లాట్ వెతుకుతూ, హౌసింగ్ బోర్డు అధికారికి తారసపడినట్టు సమాచారం.. అయితే సదరు మహిళను, ఇక్కడ ఏం చేస్తున్నారని ఆ మహిళా అధికారిని ప్రశ్నించగా, తను కొనుగోలు చేసిన ప్లాట్ చూస్తున్నట్టు, సంబంధిత అధికారినికే సమాధానం చెప్పడం గమన..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 3:





-4లో

బౌరంపేట్ సర్వే నెం.472 ప్రభుత్వ భూమి.. లేఅవుట్ వేసింది ఇదే.. ప్రస్తుత చిత్రం..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# బోర్డు తొలగించిన చోటే..! కందకం తవ్విన రెవెన్యూ..

- 'పెన్ పవర్' కథనంతో స్పందించిన రెవెన్యూ అధికారులు..
- హెచ్చరిక బోర్డు పీకేసి.. ఫెన్సింగ్ కూల్చేసిన కబ్జాదారులపై..! కేసులు పెట్టేదెప్పుడు..?




- పేట్ బషీరాబాద్ సర్వే నెం.23 ప్రభుత్వ భూమిలో కందకం తవ్విన అధికారులు..
- "పెన్ పవర్" కథనంతో రెవెన్యూ అధికారుల స్పందన..
- ఫెన్సింగ్‌ను, బోర్డును తొలగించిన వారిపై క్రిమినల్ కేసులకు ఆకుల సతీష్ డిమాండ్.
- మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కు సతీష్ వినతిపత్రం..
- ప్రభుత్వ భూమికి మళ్లీ ఫెన్సింగ్ వేసి రక్షించాలని విజ్ఞప్తి..!
- డీసీపీ కార్యాలయం లేదా ఇతర ప్రజా అవసరాలకు భూమిని కేటాయించాలని డిమాండ్..

-5 లో

# ఈ నెల మూడో వారంలో యూకే, అమెరికా పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డి

## విద్యా ప్రమాణాలు, నైపుణ్యాలు, క్రీడల అభివృద్ధే లక్ష్యంగా..




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలను రాష్ట్రానికి తీసుకురావడం.. అంతర్జాతీయంగా తెలంగాణ యువతలో నైపుణ్యాలను పెంపొందించడం.. క్రీడల్లో తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపును సాధించడం.. తదితర అంశాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల మూడో వారంలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 18 నుంచి 20 మధ్య సీఎం పర్యటన ప్రారంభమయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నుంచి ముందుగా యూకేకు, అక్కడి నుంచి అమెరికాకు ముఖ్యమంత్రి వెళ్లనున్నారు. సీఎం వెంట మాజీ సీఎస్, ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావు, ఇతర అధికారులు కూడా వెళ్లే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆయా దేశాల్లోని ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలను, క్రీడా సంస్థలను,


-5 లో

# ప్రభుత్వ భూమికి రక్షణేదీ..? కబ్జాదారులకు అడ్డేదీ..?

| | | | | |
|---|---|---|---|---|
| Bowrampet | 472 | 31.34 | Govt. | 1.Substation(Ac.10-00gts)<br>2.DILL/Housing Board including road (Ac.21-00gts)<br>3. Remaining agricultural ensroachment including road (Ac.0-34gts) |


రెవెన్యూ రికార్డు ప్రకారం ప్రభుత్వ స్థలం..




472లో దిల్ సంస్థ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు..

టిజిహెచ్‌బి అధికారులు 472లో ప్రీకాస్ట్ ఫెన్సింగ్,పైన 'టిజిహెచ్‌బి'




## అమాయకులు మోస పోతున్నారు.. అప్రమత్తం అవస్యం..

బౌరంపేట్ సర్వే నెంబర్ 472 అసైన్డ్ భూమిపై, అధికారులు నిఘా పెట్టక పోతే..! అక్రమార్కుల చేతిలో, అమాయక ప్రజలు మోసపోయే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు.. మూడేళ్ళ క్రితం అదనపు కలెక్టర్ సందర్శనతో, అక్రమ నిర్మాణాలకు బ్రేక్ పడినా..! లేఅవుట్ సృష్టించి, ప్లాట్‌ల విక్రయాలు, లోలోపల నిరాటంకంగా సాగుతున్నాయని, స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఈ విషయంపై హౌసింగ్ బోర్డ్ అధికారి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) వాణితో ప్రస్తావించగా, స్పందించారు.. కొద్ది రోజుల క్రితం సంబంధిత స్థలాన్ని సందర్శించిన సందర్భంలో, ఓ బాధితురాలు తనకు తారస పడ్డారని తెలిపారు.. ఆర్జీకేలో నివసించే ఓ మహిళ, తను కొనుగోలు చేసిన ప్లాట్, అదే స్థలంలో ఉందని చెప్పడం, విస్మయానికి గురిచేసిందని డీఈఈ వాణి పేర్కొన్నారు.. వెంటనే ఈ స్థలం ప్రభుత్వ భూమిగా, సదరు బాధిత మహిళకు వివరించినట్లు తెలిపారు.. ఈ ప్లాట్‌ల విక్రయాలు, విషయాన్ని రెవెన్యూ అధికారులకు, డీఈఈ సమాచారం చేరవేసినట్టు తెలిపారు.. టిజిహెచ్‌బి నుండి త్వరలో 10 హెచ్చరిక బోర్డులు పెడుతున్నామని డీఈఈ వాణి 'పెన్ పవర్' ప్రతినిధితో తెలిపారు..




బౌరంపేట్ సర్వే నెం.472 ప్రభుత్వ భూమిలో, 2024 మే 30న చదును చేస్తున్న,(పాత ఫొటో)

## కఠిన చర్యలు చేపట్టక.. ప్లాట్‌ల విక్రయాలు..

దుండిగల్ గండిమైసమ్మ మండలం బౌరంపేట్, సర్వే నెంబర్ 472 దిల్ సంస్థకు కేటాయించిన స్థలాన్ని, 2024 జూలై 31న అడిషనల్ కలెక్టర్ సందర్శన అనంతరం, కబ్జాదారులపై కఠినమైన చర్యలు తీసుకోక పోవడంతో, పరిస్థితులు మరింత తీవ్రంగా మారాయి.. నాడు అదనపు కలెక్టర్, ఆర్డీవో సందర్శించిన అదే స్థలలో..! యాదుల్లా అనే ఓ కబ్జాదారుడు, "284 ప్లాట్‌లు"గా దర్జాగా లేఅవుట్ వేసాడు.. సొంతింటి కల నెరవేర్చుకోవాలి అనుకునే, అమాయకులను టార్గెట్ చేసి, నోటరీలతో ప్లాట్‌ల విక్రయాలు చేస్తున్నట్టు సమాచారం.. తాజాగా ఓ బేస్మంట్ కూడా నిర్మించారని స్థానికుల ఆరోపణ.. రెవెన్యూ అధికారులపై ఉన్న నమ్మకంతో, తెలంగాణ హౌసింగ్ బోర్డ్‌కు కేటాయించిన, సర్వే నెంబర్ 472 భూమిలో రియల్ దందా కొనసాగుతుంది.. ఇదంతా అసైనీలతో ఒప్పందంతోనే జరుగుతోందని విమర్శలు వస్తున్నప్పటికీ.. కొందరు మాత్రం తమ భూమి ఎవరికి ఇవ్వలేదని చెప్పడం కొస మెరుపు..

- 3 పేజి తరువాయి

ప్రభుత్వ భూముల పరిరక్షణలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ, నిఘా, కొరవడిందని ఈ కబ్జాలతో తేటతెల్లం చేస్తుంది.. మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ-దుండిగల్ మండలం, బౌరంపేట్‌లో సర్వే నెంబర్ 472 ప్రభుత్వ భూమి మొత్తం 31.34 ఎకరాలు, అందులో 10 ఎకరాలు విద్యుత్ శాఖ సబ్ స్టేషన్‌కు, 21 ఎకరాలు దిల్ నిర్మాణ సంస్థ (టిజిహెచ్‌బి)కి కేటాయించగా, మిగిలిన 34 గుంటల స్థలం వ్యవసాయ భూమిగా ఆక్రమణలో ఉన్నట్టు రెవెన్యూ రికార్డుల్లో స్పష్టంగా ఉంది.. అయితే కొందరు కబ్జాదారులు,2023-24 ప్రాంతంలో అసైనీలతో బేరం కుదుర్చుకుని, మూడేళ్ళ క్రితం (2024), ఓ అవినీతి అధికారితో ఒప్పందం కుదుర్చుకుని, తమ సామాజిక వర్గానికి చెందిన, కబ్జాదారులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని ఆరోపణలు ఉన్నాయి.. '2024 మే 30'న మట్టి నింపి ఇటాచ్చీలతో చదును చేస్తున్న నాటి పాత ఫోటోలు ఇవ్వాలిటి 'పెన్ పవర్' దినపత్రికలో చూడవచ్చు.. ఆతర్వాత నాలుగు గదులను అక్రమంగా నిర్మించారు.. ఈ గదుల నిర్మాణం విషయం, ఉన్నతాధికారులకు మూడేళ్ళ క్రితమే చేరింది.. వెంటనే చర్యలకు ఆదేశించగా, ఆ నాలుగు అక్రమ కట్టడాలు దుండిగల్ రెవెన్యూ అధికారులు, వెంటనే నేల మట్టం కూడా చేశారు.. అయితే బౌరంపేట్ సర్వే నెం. 472 ప్రభుత్వ భూమి ఆక్రమణ తోపాటు, అధికారులకి సర్వే నెంబర్ 166 ప్రభుత్వ భూమిలో కబ్జా ఆరోపణల ఫిర్యాదులు అందాయి..

'2024 జూలై 31'న అదనపు కలెక్టర్ ఆ రెండు ప్రభుత్వ సర్వే నెంబర్‌ల పరిశీలనలో భాగంగా, 472 , 166 భూములను సందర్శించారు.. సర్కారు భూముల్లో అక్రమ నిర్మాణాలు, ఫెన్సింగ్‌లు ఏంటని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.. సంబంధిత భూముల్లోకి ఎవరూ వెళ్ళకుండా, కందకం తవ్వారు.. ఇదంతా మూడేళ్ళ క్రితం మాట..

## కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




**హైదరాబాద్ పెన్ పవర్:** సింగరేణి సంస్థ అభివృద్ధికి కీలక ముందడుగు వేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సమీపంలోని పీకేవోసీ- 2 (ప్రకాశం ఖని ఓపెన్ కాస్ట్) డిప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు, అధికారులకు, కార్మిక సంఘాల ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఇటీవలే ఒడిశాలోని నైని, తాడిచర్ల-2 కోల్‌బ్లాక్ సింగరేణి సిగలో చేరిన సందర్భంలో.. పీకేవోసీ- 2 డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికే దక్కాలని కార్మికులు, యూనియన్ లీడర్ల నుంచి డిమాండ్లు వచ్చాయి. సింగరేణి శ్రేయస్సు, అభివృద్ధి కోసం ఈ బ్లాక్ సింగరేణికి వచ్చేందుకు ప్రత్యేక కృషి చేసినందుకే ఈ విజయం సాధించాం. ఆగస్టు 3న వేలం ప్రక్రియ పూర్తికావడంతో.. సింగరేణికి పీకేవోసీ- 2 బ్లాక్‌ను కేటాయిస్తారు. ఈ బ్లాక్‌లో సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వులు ఉన్నాయి. ఏడాదికి 6 మిలియన్ టన్నుల చొప్పున 25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుంది. దాదాపు 2 వేల మందికి కొత్తగా ఉద్యోగావకాశాలు వస్తాయి. ఇక్కడ దొరికే జీ-8 (మంచి నాణ్యత) బొగ్గు కారణంగా.. మొత్తం రూ.43వేల కోట్లకుపైగా రెవెన్యూ ఉత్పత్తి అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్ల ఆదాయం లభిస్తుంది. దీనివల్ల తెలంగాణ ఇంధన భద్రతకు భరోసా, సింగరేణి అభివృద్ధికి అవసరమైన వనరులు సమకూరుతాయి. సింగరేణికి వరుసగా 3 బొగ్గు బావులు దక్కడం ద్వారా.. దక్షిణ భారతదేశానికి అవసరమైనంత బొగ్గు అందుబాటులోకి వస్తుంది. ఇది రాష్ట్ర అభివృద్ధి, ఉద్యోగ కల్పనకు దోహదం చేస్తుంది' అని ఆయన పేర్కొన్నారు.

## ఫీజు బకాయిలు చెల్లించకపోతే మిలిటెంట్ పోరాటం: ఆర్.కృష్ణయ్య

- హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యాలయం ముట్టడికి బీసీ విద్యార్థి సంఘం పిలుపు
- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఆర్.కృష్ణయ్య ఆగ్రహం
- ఏపీ తరహాలో పూర్తి ఫీజు చెల్లించాలని డిమాండ్
- తెలంగాణలో ప్రస్తుతం ఇంజినీరింగ్‌కు రూ.35 వేలు మాత్రమే ఇస్తున్నారని విమర్శ
- పూర్తి ఫీజు కోసం ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టీకరణ



**హైదరాబాద్ పెన్ పవర్:**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బకాయిల చెల్లింపులో జాప్యం కొనసాగితే మిలిటెంట్ పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. బీసీ విద్యార్థి సంఘం సోమవారం హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల గురించి ప్రశ్నిస్తే తాను ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నానని, కాబట్టి ఏపీలోనే పోరాటం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం బాధాకరమని ఆర్.కృష్ణయ్య విమర్శించారు.ఆంధ్రప్రదేశ్‌లో కూడా కొంత బకాయి ఉన్నప్పటికీ అక్కడ అమలవుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం మెరుగ్గా ఉందని అన్నారు. విద్యార్థుల పూర్తి ఫీజును అక్కడ ప్రభుత్వం భరిస్తోందని చెప్పారు. తెలంగాణలో మాత్రం ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.35 వేలు, డిగ్రీ విద్యార్థులకు రూ.15 వేలు మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు.ఆంధ్రప్రదేశ్ తరహాలో విద్యార్థుల పూర్తి ఫీజును ప్రభుత్వమే భరించే విధానాన్ని తెలంగాణలో కూడా అమలు చేయాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బకాయిల విడుదలతో పాటు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# బోర్డు తొలగించిన చోటే..! కందకం తవ్విన రెవెన్యూ




- 'పెన్ పవర్' కథనంతో స్పందించిన రెవెన్యూ అధికారులు..
- హెచ్చరిక బోర్డు పీకేసి.. ఫెన్సింగ్ కూల్చేసిన కబ్జాదారులపై..! కేసులు పెట్టేదెప్పుడు..?





అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్..

- పేట్ బషీరాబాద్ సర్వే నెం.23 ప్రభుత్వ భూమిలో కందకం తవ్విన అధికారులు..
- "పెన్ పవర్" కథనంతో రెవెన్యూ అధికారుల స్పందన..
- ఫెన్సింగ్‌ను, బోర్డును తొలగించిన వారిపై క్రిమినల్ కేసులకు ఆకుల సతీష్ డిమాండ్.
- మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కు సతీష్ వినతిపత్రం..
- ప్రభుత్వ భూమికి మళ్లీ ఫెన్సింగ్ వేసి రక్షించాలని విజ్ఞప్తి..!
- డీసీపీ కార్యాలయం లేదా ఇతర ప్రజా అవసరాలకు భూమిని కేటాయించాలని డిమాండ్..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 3:**

ప్రభుత్వ భూముల పరిరక్షణలో కుత్బుల్లాపూర్ తహశీల్దార్ రాజేష్ స్పందనపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.. "పెన్ పవర్" కథనంతో ఆ ప్రభావం స్పష్టంగా కనిపించింది.. సోమవారం "పెన్ పవర్" దినపత్రికలో "రెవెన్యూ బోర్డ్ తొలగింపు..! మైసా మాయేనా..!" అనే ప్రత్యేక కథనం ప్రచురితమైన వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి, రెవెన్యూ హెచ్చరిక బోర్డ్ తొలగించిన చోటనే కందకం తవ్వి, కబ్జాదారుల చెంప చెల్లు మనిపించారు.. పేట్ బషీరాబాద్ సర్వే నెంబర్ 23లోని సుమారు రెండు ఎకరాల విలువైన ప్రభుత్వ భూమికి జూన్ 25న రెవెన్యూ అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డును, ఏర్పాటు చేశారు. అయితే కొందరు గుర్తు తెలియని వ్యక్తులు, ఫెన్సింగ్, బోర్డును తొలగించి ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు.. పెన్ పవర్ కథనంతో, ఈ ఘటనపై స్పందించిన కుత్బుల్లాపూర్ తహశీల్దార్ రాజేష్, కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని "పెన్ పవర్" ప్రతినిధికి తెలిపారు. అనంతరం రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని ప్రైవేటు బిల్డర్లు వినియోగించకుండా కందకాలు తవ్వి రక్షణ చర్యలు చేపట్టారు.. అయితే ఇప్పటి వరకు పోలీసులకు అధికారిక ఫిర్యాదు నమోదు కాలేదని సమాచారం..

**పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్**

## అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు..

పేట్ బషీరాబాద్ సర్వే నెం.23 ప్రభుత్వ భూమి వ్యవహారంలో సామాజిక వేత్త ఆకుల సతీష్, సోమవారం ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.. ఫెన్సింగ్‌ను, ప్రభుత్వ హెచ్చరిక బోర్డును తొలగించి కబ్జాకు యత్నించిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, మళ్లీ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిని శాశ్వతంగా రక్షించాలని ఆయన కోరారు.. గతంలో సంబంధిత ప్రభుత్వ భూమిని డీసీపీ కార్యాలయం అవసరాల కోసం కేటాయించిన విషయాన్ని గుర్తుచేస్తూ, అదే ప్రయోజనం కోసం, తిరిగి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఇతర ప్రజా అవసరాలకు కేటాయించి ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు..ఈ అంశంపై ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్ కేసు నమోదు చేయాలని ఇప్పటికే ఆదేశించినట్లు తనకు సమాచారం అందిందని ఆకుల సతీష్ తెలిపారు



బోర్డ్ తొలగించిన అదే చోట, కందకం తవ్విన రెవెన్యూ అధికారులు.



రెవెన్యూ హెచ్చరిక బోర్డ్ తొలగించినది ఇదే..

## ఈ నెల మూడో వారంలో యూకే, అమెరికా పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డి

-3 పేజి తరువాయి

నైపుణ్య కేంద్రాలను ముఖ్యమంత్రి సందర్శిస్తారు. సంబంధిత అధికారులు, నిపుణులతో సమావేశమవుతారు. తెలంగాణలో సంబంధిత రంగంలో అభివృద్ధి, అవకాశాల కల్పనకు సంబంధించి పరస్పర అవగాహన ఒప్పందాలు చేసుకునే అవకాశాలున్నాయి. ముఖ్యంగా తెలంగాణలో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఆయా విశ్వవిద్యాలయాలతో సంప్రదింపులు జరిపే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలు విశ్వవిద్యాలయాలు తెలంగాణలో తమ క్యాంపస్‌లను నెలకొల్పడానికి సంసిద్ధత వ్యక్తం చేసిన నేపథ్యంలో.. మరిన్ని విఖ్యాత వర్సిటీలను కూడా రాష్ట్రానికి ఆహ్వానించే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే స్కిల్స్ యూనివర్సిటీని స్థాపించిన నేపథ్యంలో.. ఇక్కడికి అంతర్జాతీయ సంస్థలను రప్పించడంపైనా ఈ పర్యటనలో దృష్టి సారించనున్నారు. ఒలింపిక్స్‌లో తెలంగాణ ద

పతకాలను సాధించాలనే లక్ష్యాన్ని పదే పదే ప్రస్తావిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఈ పర్యటనలో క్రీడాభివృద్ధికి రాష్ట్రంలో అమలు చేయాల్సిన అంశాలను కూడా యూకే, అమెరికా పర్యటనల్లో ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

## ముందస్తు పారిశుధ్య కార్యక్రమాలు పగడ్బందీగా నిర్వహించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ జిల్లాలో ఐదు డెంగ్యూ వ్యాధులు నమోదయ్యాయని వాటి సంఖ్య పెరగకుండా వాటిని నిరోధించేందుకు అన్ని గ్రామాలు మున్సిపాలిటీలలో పారిశుధ్య కార్యక్రమాలు పగడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ముఖ్యంగా మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు పగడ్బందీగా నిర్వహించేలా చూడాలన్నారు. ప్రతి మంగళవారం మరియు శుక్రవారం రెండు రోజులు కచ్చితంగా డ్రై డే కార్యక్రమాలు నిర్వహించి వర్షం నీరు నిలువ లేకుండా చూడాలన్నారు.




పంచాయతీ శాఖ సహకారంతో ఈనెల 4వ తేదీ మంగళవారం రోజు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి నిలువ నీరు లేకుండా చూసుకోవాలని చెత్తాచెదారం తొలగించాలని అన్నారు. డెంగ్యూ వ్యాధి నమోదైన జిల్లాలోని గ్రామాలలో వెంటనే డోర్ టు డోర్ ఫీవర్ సర్వే నిర్వహించి, ప్రత్యేక పరిశుద్ధ కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్, డిఆర్ఓ నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ బోనాల పండుగను విజయవంతం చేయాలి

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 3:** ఈ నెల 5వ తేదీన జరగనున్న ముత్యాలమ్మ బోనాల పండుగను గ్రామ ప్రజలందరు సహకారంతో ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని గౌడ సంఘం కుమ్మర చాకలి సంఘం కులస్తులు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని స్థానిక గార్ల మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం కుమ్మరి , గౌడ చాకలి సంఘాల ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వహణ కొరకు సన్నాహక సమావేశం నిర్వహించారు. గ్రామ సంప్రదాయాలకు అనుగుణంగా బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని నిర్ణయించారు అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగ నిర్వహణకు గ్రామ ప్రజలంతా సహకరించాలని గ్రామంలో ప్రతి కుటుంబం బోనాల పండుగలో పాల్గొని ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులు పొంది కృపకు పాత్రులు కావాలని గ్రామ ప్రజల ఐక్యతకు ప్రత్యేకంగా నిర్వహించే ముత్యాలమ్మ బోనాల పండుగను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గార్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతి, హతిరాం నాయక్, కుమ్మరి సంఘం, గౌడ సంఘం కులస్తులు తాళ్లూరి రవీందర్, అలవాల క్రాంతి, ఏదునూరి కుమారస్వామి, మహేష్, నాగేశ్వరరావు, శ్రీకాంత్, కోండల్ శ్రీనివాస్, వీరన్న, కందునూరి ఈశ్వర్ లింగం, కందునూరి శ్రీనివాస్, తాళ్లపెల్లి కృష్ణ, తోడేటి నాగరాజు, కత్తి వెంకన్న, కొత్తకొండ కుమార్, తోడేటి శ్రీనివాస్, కత్తి శివ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆయా సంఘాల నాయకులు

# జైల్ భరో ను జయప్రదం చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వెంకన్న

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 3:** కార్మిక కోడ్ లు , వీబీజీ గ్రామ్ జీ , విత్తన బిల్లు, విద్యుత్ బిల్లు, ఆహార భద్రత చట్టం తదితర పేదల వ్యతిరేక చట్టాలను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న, సిఐటియు జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ లు పిలుపునిచ్చారు. సిపిఎం కార్యాలయంలో ఆయా సంఘాల మండల కమిటీ ఆధ్వర్యంలో వి. పి వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల సెమినర్ లో వారు మాట్లాడారు. ప్రజలు, కార్మికులు, రైతుల వ్యతిరేక విధానాలను గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్రజలకు వివరించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతు డిస్కంను రద్దు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లనుఉపసంహరించుకోవాలని, విదేశీ దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని ప్రధాన డిమాండ్లతో దేశవ్యాప్తంగా జైల్ భరో కార్యక్రమం చేపడుతున్నట్లు

తెలిపారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి, రాష్ట్రాలపై అదనపు భారం మోపడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని ధ్వజామెత్తారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సవరణ బిల్లు 2025ను ఆపాలని, విద్యుత్ సవరణ బిల్లు అమల్లోకి వస్తే చేతివృత్తిదారులు, పేదలు, బలహీన వర్గాలు తీవ్రంగా నష్టపోతాయని,చిన్న వృత్తులు చేసుకునే లక్షలాది మంది విద్యుత్తు సబ్సిడీపై పనులు చేసుకుంటున్నారని, వారి మనుగడను బుగ్గిపాలు చేస్తున్న కేంద్ర బీజేపీ సర్కార్ కుట్రలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సెమినార్ లో సిపిఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, ఆయా సంఘాల నాయకులు గడ్డిపాటి రాజారావు,బొబ్బా ఉపేందర్ రెడ్డి,సిహెచ్. ఎల్లయ్య,ఎస్ కె బాజీ,సి హెచ్. మౌనిక, ఎం. నాగమణి,కె. మహేశ్వరరావు,కై బాబు,నంద్యా,జి. వీరభద్రం,జె. సత్యం,బి. వీరన్న, సమ్మయ్య, కె సిఆర్, ఇస్తారి, రామయ్య,రైతు లు, వ్య. కా. స, సీఐటీయూ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థ అంత దారుణమా...

**హైదరాబాద్, ఆగస్టు 3 పెన్ పవర్:**
మన రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సుమారు లక్షా పదివేల మంది విద్యార్థులు వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి పట్టాలు పొందుతున్నారు. కానీ ఈ పట్టాలు చేతపట్టుకుని బయటకు వస్తున్న యువతలోకేవలం పదిహేను శాతం మంది మాత్రమే పరిశ్రమల ప్రమాణాలకు సరిపోతున్నారు. మిగిలిన మెజారిటీ విద్యార్థులు కనీసం ప్రాథమిక కోడింగ్ లేదా కమ్యూనికేషన్ నైపుణ్యాలు లేక ఇబ్బందులుపడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల పరిస్థితిని ప్రస్తావిస్తూ కఠినమైన పదాలు వాడారు. గమనించాల్సిన విషయం ఏమిటంటే గతంలో కేసీఆర్ కూడా అసెంబ్లీలో ఇదే ఆందోళన వ్యక్తం చేశారు. ఇద్దరు నేతల మాటల శైలి వేరుగా ఉన్నప్పటికీ వారిద్దరి ఆవేదన వెనుక ఉన్న ప్రధాన కారణం మన విద్యావ్యవస్థలో నెలకొన్న తీవ్రమైన లోపమే. సాంకేతిక విద్య ఈ స్థాయికి దిగజారడానికి ప్రధాన కారణంవిద్యావ్యవస్థ పూర్తిగా వ్యాపారమయం కావడమే. గత కొన్ని సంవత్సరాలుగా పుట్టగొడుగుల్లా వెలిసిన ప్రైవేట్ కళాశాలల్లో తగినంత మౌలిక వసతులు అసలే లేవు. ఆధునిక ప్రయోగశాలలు లేకపోవడం అలాగే అనుభవం ఉన్న నాణ్యమైన అధ్యాపకుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైపు వేగంగా దూసుకుపోతుంటే చాలా కాలేజీలు ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నేబోధిస్తున్నాయి. ప్రశ్నాపత్రాలు కేవలం పుస్తకాల్లోని విషయాలను గుడ్డిగా గుర్తుపెట్టుకుని రాసే రీతిలోనే ఉంటున్నాయి. దీనివల్ల విద్యార్థుల్లో సమస్యలను స్వయంగా పరిష్కరించే ధోరణి పూర్తిగాకరువవుతోంది. తల్లిదండ్రులు తమ కష్టపడిన సంపాదనతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే ఫీజు సాయాన్ని కలిపి లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు. పిల్లలను ఎంతో ప్రయాసపడి ఇంజినీరింగ్ చదివిస్తే డిగ్రీపూర్తయ్యాక ప్రైవేట్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు రావడం లేదు. దీనితో నిరుద్యోగ యువత తీవ్ర నైరాశ్యంలోకి వెళ్లిపోతూ చివరకు ప్రభుత్వ ఉద్యోగాల కోసం తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. ఇంజినీరింగ్‌పాసైన కుర్రాడు కనీసం చిన్న ఉద్యోగానికైనా సరిగ్గా వెళ్లలేకపోతున్నాడనే ఆవేదన పాలకులలో స్పష్టంగా కనిపిస్తోంది. నాయకులు చేసిన తీవ్రమైన వ్యాఖ్యలలో ఎవరి మనోభావాలను కించపరచాలనే ఉద్దేశంలేదు. అక్కడ కనిపిస్తున్నది సమాజం ముందున్న ఒక స్పష్టమైన వాస్తవం. పరిశ్రమల అవసరాలకు తగ్గ ప్రాక్టికల్ నైపుణ్యాలు లేకపోవడం వల్ల యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన శిక్షణ లేనికారణంగా కనీసం ఒక చిన్న దరఖాస్తును కూడా సరిగ్గా రాయలేని స్థితిలో విద్యార్థులు బయటకు వస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చడానికి కేవలం విమర్శలు సరిపోవు కానీ సరైన ప్రణాళికలు అవసరం.

కాలేజీలు కేవలం మార్కులు అలాగే సర్టిఫికెట్లు ఇచ్చే యంత్రాలుగా మారడం వల్ల సమాజానికి ఒరిగేది ఏమీ లేదు. సాంకేతిక రంగంలో ప్రపంచంతో పోటీపడే అర్హతలను అందించేలా విద్యాప్రమాణాలు పూర్తిగామారాలి. అప్పుడే యువతకు బంగారు భవిష్యత్తు లభిస్తుంది. ప్రస్తుత తరానికి అర్థమయ్యేలా సులభమైన మంచి తెలుగులో మన విద్యావ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసుకోవాలి. యువత కేవలం డిగ్రీ పత్రాలకోసం కాకుండా నిజమైన నైపుణ్యాలు సంపాదించే దిశగా అడుగులు వేయాలి. ప్రభుత్వం కూడా కాలం చెల్లిన సిలబస్‌ను మార్చి పరిశ్రమలకు కావాల్సిన కోర్సులను కాలేజీల్లో ప్రవేశపెట్టాలి. అప్పుడే ఈరాష్ట్రంలోని ప్రతి విద్యార్థి ప్రపంచ వేదికపై గర్వంగా నిలబడగలుగుతాడు. నేటితరం యువతకు కావాల్సింది కేవలం డిగ్రీ కాదు కానీ అద్భుతమైన సృజనాత్మకత. ఈ దిశగా అందరూ కలిసికట్టుగా ఆలోచించి తగిన చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

# అందుబాటులోకి తొలి ప్రైవేట్ ఆయిల్ పామ్

**ఖమ్మం, ఆగస్టు 3 పెన్ పవర్:**
తెలంగాణలో తొలి ప్రైవేటు సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ ఖమ్మం జిల్లా అంజనాపురంలో ఈ నెల 20న ప్రారంభం కానుంది. గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ రూ. 300 కోట్ల పెట్టుబడితో 113.5 ఎకరాల్లోనిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా 700 మందికి ఉపాధి లభించనుంది. మలేసియా భాగస్వామ్యంతో దేశంలోనే తలమానికంగా నిలిచే సీడ్ గార్డెన్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు రాష్ట్రంలోనిర్మాణంలో ఉన్న మరో ఆరు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రైవేటు సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ప్రముఖ గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ సంస్థ ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి రెవెన్యూ పరిధిలోనిఅంజనాపురం గ్రామపంచాయతీ లో ఈ మెగా ప్రాజెక్టును నిర్మించింది. దాదాపు రూ. 300 కోట్ల భారీ పెట్టుబడితో 113.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ సమీకృత పరిశ్రమను ఈ నెల 20న ప్రారంభించేందుకు సంస్థ సర్వ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సంస్థ ప్రతినిధులు ఇప్పటికే ఆహ్వానించారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు700 మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ పరిశ్రమలో ఇప్పటికే నర్సరీ కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతుండగా.. దాదాపు మూడు లక్షల మొక్కలను పెంచుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 1.40 లక్షల మేలైన మొక్కలను రైతులకు సరఫరా చేశారు. ఈ పరిశ్రమ పరిధి కిందికి సంగారెడ్డి జిల్లాతో పాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 12 మండలాలనుప్రభుత్వం కేటాయించింది. ఈ సరికొత్త ఫ్యాక్టరీతో తెలంగాణలో ఆయిల్‌పామ్ పరిశ్రమల సంఖ్య నాలుగుకు చేరుకోనుంది. ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలోని అప్పారావుపేటలో గంటకు 90 టన్నులు,అశ్వారావుపేటలో గంటకు 30 టన్నులు, సిద్దిపేట జిల్లా నర్మెటలో గంటకు 30 టన్నులతో కర్మాగారాలు నడుస్తుండగా.. అంజనాపురం కర్మాగారం గంటకు 15 టన్నుల సామర్థ్యంతో అందుబాటులోకివస్తోంది. ఇదే కాకుండా కల్లూరుగూడెం, బీచ్‌పల్లి, ఇంచర్ల, పెద్దరాత్‌పల్లి, సంకిరెడ్డిపల్లి, యాచారంలలో నిర్మాణ దశలో ఉన్న మరో ఆరు కర్మాగారాలను

ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వంలక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టులో ఏర్పాటు కానున్న సీడ్ గార్డెన్ దేశానికే తలమానికంగా నిలవనుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా మలేసియా కంపెనీ భాగస్వామ్యంతో గోద్రెజ్ సంస్థ ఈ విత్తన తోటను అభివృద్ధి చేస్తోందని ఆయన తెలిపారు. దీని ద్వారా రైతులకు తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడినిచ్చే హైబ్రిడ్ రకాల విత్తనాలు

లభిస్తాయని ఇవి అంతర్గత పంటల సాగుకు ఎంతో అనుకూలంగా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రైవేటు సమీకృత పరిశ్రమ రాకతో తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం మరింత వేగంగాపెరగనుందని ఆయన వెల్లడించారు. సాంప్రదాయ పంటలకు భిన్నంగా అధిక లాభాలను ఇచ్చే వాణిజ్య పంటలను తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు.

## వర్ధన్నపేట గురుకులంలో ఫుడ్ పాయిజన్:
## 25 మంది విద్యార్థినులకు అస్వస్థత.

**వరంగల్: పెన్ పవర్:** వర్ధన్నపేట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో రాత్రి కలుషిత ఆహారం తిని 25 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధిత విద్యార్థినులను వెంటనే చికిత్స నిమిత్తం వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తరచూ గురుకులాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కావడంపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# అమెరికాలో ఆట మహాసభల్లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అమెరికాలో జరుగుతున్న 'ఆట' (ఆటా) మహాసభల్లో రెండవ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలకు విచ్చేసిన ప్రవాస తెలుగు సోదరసోదరీమణులతోఆత్మీయంగా ముచ్చటించారు. తరువాత ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించారు. ఖండాంతరాల్లో కూడా మన తెలుగు వారు ఐకమత్యంతో మన సంస్కృతిని చాటిచెబుతుండటం ఎంతోఆనందంగా ఉందని అయన అన్నారు..

## కత్తిపోట్లతో వ్యక్తి దారుణ హత్య

**హైదరాబాద్ పెన్ పవర్:** మామడ మండలం పోతారం గ్రామం నందు నిన్న అర్ధరాత్రి కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. కత్తిపోట్ల ఘటనలో గ్రామానికి చెందిన పెద్దోల్ల లింబాద్రి (45) కత్తి పోట్లకు గురయ్యాడు, వెంటనే గమనించిన గ్రామస్తులు తీవ్రంగా గాయపడిన లింబాద్రిని 108 అంబులెన్స్ లో నిర్మల్ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు, పరీక్షించిన వైద్యులు అప్పటికే లింబాద్రి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. భూ తగాదాలనెపథ్యంలో ఈ హత్య జరిగినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లింబాద్రి అన్న పెద్దోళ్ళ భూమన్న కత్తితో పొడిచి హత్య చేసినట్టు తెలుస్తోంది పోలీసులు కేసు నమోదు చేసుకుని హత్యకు గల

కారణాలపై విచారణ చేపట్టారు. లింబాద్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ జిల్లా కేంద్ర ఆసుపత్రి మార్చురీకి తరలించారు లింబాద్రి మృతితో కుటుంబ సభ్యుల రోధానలు మిన్నంటాయి.

## నిమ్స్ వైద్య బృందానికి
## ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు

**హైదరాబాద్ పెన్ పవర్:** నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందన్నారు. నిమ్స్ లో ఇప్పటివరకు నిర్వహించిన రొబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని అన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందన్నారు. వైద్య రంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించాలని సీఎం ఆకాంక్షించారు.

## స్త్రీ నిధి రుణాల్లో రూ.18 లక్షల అక్రమాలు.

### వివోఏ పై చర్యలు తీసుకోవాలని మహిళల వినతి

**హైదరాబాద్ పెన్ పవర్:** మెదక్ జిల్లా టేక్మల్ మండలం టేక్మల్ గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం గ్రామ మహిళా సమాఖ్య సభ్యులు స్త్రీ నిధి ఖాతాల్లో తమకు తెలియకుండా అక్రమంగా రుణాలు తీసుకుని నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ సంబంధిత వివోఏ పై శాఖాపరంగా, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సోమవారం విడుదల చేసిన వినతిపత్రంలో మహిళలు తెలిపిన వివరాల ప్రకారం.. కనకదుర్గ, మహేశ్వరి, మల్లేశ్వరి, మల్లికార్జున, నల్ల పోచమ్మ, సంతోషిమాత, వీరహనుమాన్, విజయలక్ష్మి తదితర సంఘాలకు చెందిన సభ్యుల పేర్లపై వారి ప్రమేయం లేకుండానే 2023లో స్త్రీ నిధి రుణాలు మంజూరు చేసినట్లు ఇటీవల తెలిసిందన్నారు. తమకు చదువు రాకపోవడాన్ని ఆసరాగా తీసుకుని, తమ పేర్లపై తీర్మానాలు రూపొందించి సంతకాలను ఫోర్జరీ చేసి రుణాలు తీసుకున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో బురుజుకింది ఇందిర, సాదు పోచమ్మ, సాదు సునంద, గంగమ్మ, కుర్మ మానెమ్మ, కుర్మ పోచమ్మ, గొల్ల సాయమ్మ, సొంగ గంగమ్మతో పాటు మరికొందరు బాధితులుగా ఉన్నట్లు పేర్కొన్నారు. స్త్రీ నిధి రుణాలతో పాటు సిఐయఫ్ , వెలుగు గ్రామ సంఘం నిధులు కలిపి సుమారు రూ. 18 లక్షల మేర అక్రమాలు జరిగినట్లు ఆరోపించారు. ఈ అవకతవకలకు గ్రామ వివోఏ ఆంజనేయులు బాధ్యులని ఆరోపించిన మహిళలు, సంబంధిత సంఘాల బ్యాంకు ఖాతాల లావాదేవీలను పూర్తిస్థాయిలో విచారించి, నిధుల దుర్వినియోగంపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తమకు న్యాయం చేసి ఆర్థిక నష్టాన్ని భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# డిఎస్సీ స్కామ్ పై దక్షిణ వైసీపీ సమరభేరి..

### కారకుడైన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి

### సిబిఐతో విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి డిమాండ్

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో నిరుద్యోగ యువత భవిష్యత్తుతో కూటమి ప్రభుత్వ నేతలు ఆటలాడుతున్నారని డీఎస్సీలో జరిగిన అవకతవకలపై తక్షణమే సీబీఐతో విచారణ జరిపించాలనీ మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ డిమాండ్ చేశారు. బాధ్యత వహించి విద్యాశాఖ మంత్రి లోకేష్ వెంటనే రాజీనామా చేయాలి" అని డిమాండ్ చేశారు. సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ నాయకత్వంలో సోమవారం టౌన్ హాల్ సమావేశం ఏర్పాట చేసారు ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్సిపి రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ, సంబంధించిన అధికారులకు తగిన శిక్ష పడాలన్నారు, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి బాకీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు, ఈయొక్క సమస్యలపై పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 6 వ తేదీ నుంచి 9 వ తేదీ వరకు నిరహారదీక్షలు నిర్వహించి,10 వ తేదీన భారీ సంఖ్యలో యువకులు, విద్యార్థులు,నాయకులు,కార్యకర్తలు భారీ ర్యాలీగా నిరసన చేసి కూటమి ప్రభుత్వం వెన్నులో వణుకు పుట్టే విధంగా గొప్పగా విజయవంతం చేయాలన్నారు. దక్షిణ నియోజకవర్గంలో 14 వార్డుల్లో 6వ తేదీ గురువారం 41, 27, 30, 31, 3 2 వార్డులు, 7తేదీ న శుక్రవారం 33, 34, 35, 29 వార్డు లు, అలాగే మిగిలిన 36, 37, 38, 39, 42 వార్డులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రిలే నిరాహార దీక్షలు జరుగుతాయనీ వాసుపల్లి తెలిపారు. ప్రతి వార్డు నుండి 500 మంది కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలనీ, ఈ బాధ్యతను వార్డు ప్రెసిడెంట్లు చూసుకోవాలన్నారు. ఈ సమావేశానికి అన్ని ఉత్తరాంధ్ర ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ చెన్నా జానకిరామ్, మాజీ కార్పొరేటర్లు జిల్లా మున్సిపల్ విభాగం ప్రెసిడెంట్ కోడిగుడ్డల పూర్ణిమ శ్రీధర్, తోట పద్మావతి, బిపిన్ జైన్, వార్డు అధ్యక్షులు నీలపు సర్వేశ్వరరెడ్డి, దస్మాంతుల మాణిక్యాల రావు, దొడ్డి బాపు ఆనంద్, పిన్నింట్లో రాజారెడ్డి,ముత్తబత్తుల రమేష్,ఆలుపున కనకరెడ్డి, గురజారపు రవి, ముజీబ్ ఖాన్, కోడిగుడ్ల శ్రీధర్, మాజీ కార్పొరేటర్ పచ్చిపల్లి రాము, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రేయ్ డేవిడ్ రాజు,జిల్లా సెక్రటరీ అభిరెడ్డి అది విష్ణు,స్టేట్ నాయాకులు దశమంతులు చిన్ని,ఈతలపాక విజయభాస్కర్, వేలంగిని రావు, జిల్లా అనుబంధ సంఘాలు ప్రెసిడెంట్లు సనపల రవీంద్ర,వడ్డది దిలీప్, జిల్లా అనుబంధ సంఘాల ఉపాధ్యక్షులు,సౌత్ అనుబంధ సంఘాల ప్రెసిడెంట్లు, జిల్లా అనుబంధ సంఘాలు, వార్డ్ అనుబంధ సంఘాల అధ్యక్షులు,మహిళా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్ర ఽ జిల్లా సీనియర్ నాయకులు, దక్షిణ నియోజకవర్గ నాయకులందరూ హాజరుకావాలని వాసుపల్లి గణేష్ కుమార్ పిలుపునిచ్చారు

# కాళేశ్వరం భూ గర్భంలో సమస్యలు

**కరీంనగర్, ఆగస్టు 3, పెన్ పవర్:** తెలంగాణలో రాజకీయంగా వివాదాస్పద అంశాల్లో ప్రతిష్టాత్మక కాళేశ్వరం ప్రాజెక్ట్ అతిముఖ్యమైనది. భారీ ఖర్చుతో నిర్మించిన ప్రాజెక్టుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మూడేళ్ల నుంచి మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి మరో కీలక విషయం బయటపడింది. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, మరియు సుందిళ్ల బ్యారేజీల దిగువన భూగర్భంలో అనేక సాంకేతిక లోపాలు ఉన్నట్లు గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ పరీక్షలలో తేలింది. బ్యారేజీల కొన్ని వెంట్స్ (నీరు ప్రవహించే మార్గాలు) కింద ఖాళీ ప్రదేశాలు ఏర్పడి నీరు చేరడం (కేవిటీస్), పెద్ద పరిమాణంలో బోల్డర్లు, దెబ్బతిన్న రాతి పొరలు, రాళ్ల దిగువ భాగాన పూడిక పేరుకుపోవడం వంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఈ జియోఫిజికల్ పరిశీలనల ఆధారంగా పుణెలోని ప్రసిద్ధ కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ డైరెక్టరు సెల్వబాలన్ ఒక సమగ్ర నివేదికను తెలంగాణ నీటిపారుదల శాఖకు పంపారు. 3 బ్యారేజీల దిగువన సుమారు 30 మీటర్ల లోతు వరకు భూగర్భంలో ఉన్న పరిస్థితులు, సీపేజీ మార్గాలు, అనామలీస్ (భిన్నమైన పరిస్థితులు)ను అధ్యయనం చేయడానికి ఈ అధునాతన జీపీఆర్ పరీక్షలను సీడబ్ల్యూపీఆర్ఎస్ నిర్వహించింది. ఈ అధ్యయనంలో భాగముగా మూడు బ్యారేజీల్లోని మొత్తం 225 వెంట్లకు గాను 217 వెంట్స్ వద్ద క్షేత్రస్థాయి అధ్యయనాలు జరిగాయి. ఈ నివేదికలోని వివరాల ప్రకారం, మేడిగడ్డ బ్యారేజీలోని 7 వెంట్స్ దిగువన అత్యంత తీవ్రమైన అనామలీస్ నమోదయ్యాయి. కీలకమైన మేడిగడ్డలోని 7వ బ్లాక్‌కు చెందిన 17, 18, 19, 20, 21 వెంట్లలోనూ, 8వ బ్లాక్‌లోని 7వ వెంట్‌లోనూ, 5వ బ్లాక్‌లోని 35వ వెంట్‌లోనూ ఈ భూగర్భ లోపాలను గుర్తించినట్లు నివేదికలో తెలిపారు. ఇదే ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీలోని 5వ బ్లాక్‌లో ఉన్న 47వ వెంట్ ఎగువ భాగంలోనూ, సుందిళ్ల బ్యారేజీలో 25, 31, మరియు 53వ వెంట్స్ వద్దఎగువ, దిగువ ప్రాంతాలలో సమస్యలు ఉన్నట్లు తేలింది. ఈ 3 బ్యారేజీలలో కలిపి మొత్తం 11 వెంట్స్ కింద మాత్రమే ఎలాంటి సమస్యలు లేదా అనామలీస్ లేవని, మిగతా వాటిలో చిన్న సమస్యలుఉన్నాయని నివేదికలో వెల్లడించినట్లు సమాచారం. మేడిగడ్డ వద్ద నీటి ఉధృత ప్రవాహాల కారణంగా ఇసుక కొట్టుకుపోయి, రాఫ్ట్ దిగువన పెద్ద ఎత్తున శూన్య ప్రాంతాలు ఏర్పడ్డాయి. 6 వెంట్స్ వద్ద పదికి పైగావిభిన్నమైన అనామలీస్ జోన్లను శాస్త్రవేత్తలు నమోదు చేశారు. ఇటువంటి పరిస్థితులు నీటి అంతర్గత సీపేజ్, పైపింగ్ వంటి ప్రమాదకర పరిణామాలకు దారితీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయితే, జీపీఆర్ పరీక్షలు కేవలం భూగర్భ పరిస్థితులను అంచనా వేయడానికి మాత్రమే పరిమితమని, నేరుగా స్ట్రక్చరల్ లోపాలను ఇవి నిర్ధారించలేవని సీడబ్ల్యూపీఆర్ఎస్ స్పష్టం చేసింది. అందువల్ల పునరావాస లేదా మరమ్మతు పనులు ప్రారంభించే ముందు బోర్‌హోల్, కోర్ డ్రిల్లింగ్, ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టోమోగ్రఫీ వంటి ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించడం అనివార్యమని సూచించింది.ప్రాజెక్టు బ్యారేజీల నిర్మాణ సమయంలో ముందస్తు భూగర్భ అన్వేషణ పరీక్షలు చేపట్టకపోవడం వల్లే ఈ సమస్యలు ముందుగా గుర్తించలేకపోయినట్లు ఇంజినీరింగ్ టీమ్ పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం ఈ నివేదికను బయటపెట్టడం గానీ, మంత్రులు, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ అధికారులు గానీ కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ ( సీడబ్ల్యూపీఆర్ఎస్) నివేదికపై స్పందిస్తే మరిన్ని విషయాలు బయిటకు వచ్చే అవకాశం ఉంది

# ఇప్పుడు అదిలాబాద్ ఎయిర్ పోర్టు క్రెడిట్ వార్

**అదిలాబాద్, ఆగస్టు 3, పెన్ పవర్:** ఏపీలో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ప్రారంభం కాగా, దీనిపై కూటమి ప్రభుత్వం, వైఎస్సార్ సీపీ ఇది తమ ఘనతేనని క్లెయిమ్ చేస్తున్నాయి. తమ హయాంలోనే దాదాపు ఎయిర్ పోర్ట్ పనులు పూర్తికాగా, సీఎం చంద్రబాబు ఫినిషింగ్ వర్క్స్ పూర్తి చేశారని వైసీపీ అంటోంది. తాము ఏది సాధించినా క్రెడిట్ తమ ఖాతాలో వేసుకోవడం వైసీపీకి అలవాటు అయిందంటూ కూటమి నేతలు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ విషయంలోనూ క్రెడిట్ గేమ్ మొదలైంది. సాధించింది తామేనని బీజేపీ నేతలు చెబుతంటే, బీజం వేసింది తానేనని, మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీ అని మాజీ ఎంపీ సోయం బాపూరావు వ్యాఖ్యానించారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ మంజూరు, పనులకు అనుమతులపై మాజీ ఎంపీ సోయం బాపూరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ లో ఎయిర్ పోర్ట్ మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీనే అని, దానికి గతంలో బీజం వేసింది తానేనని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు హాజరయ్యారు. ముందుగా గ్రామనికి చేరుకున్న నాయకులకు స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం పార్టీ బలోపేతం కోసం దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పార్టీ శ్రేణఉలకు పిలుపునిచ్చారు.మాజీ ఎంపీ సోయం బాపూరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కృషితో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నాలతో ఆదిలాబాద్ జిల్లా కు ఎయిర్ పోర్ట్ మంజూరు అయ్యిందన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడే ఆదిలాబాద్ జిల్లాకు విమానాశ్రయం కోసం అప్పటి కేంద్ర మంత్రులకు ప్రధానికి వినతిపత్రాలు ఇచ్చానని, అంటే ఈ ఎయిర్‌పోర్ట్ కోసం ముందస్తుగా బీజం వేసింది తానేనని గుర్తు చేశారు. దానికి సాక్షం బీజేపీ ఎమ్మెల్లే పాయల్ శంకర్ అన్నారు. కానీ స్థానిక ఎమ్మెల్లే, బీజేపీ నాయకులు తామే ఆదిలాబాద్ కు విమానాశ్రయం తెచ్చింది తామేనని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ చేస్తే స్థానిక ఎమ్మెల్లే శంకర్ తానే చేస్తున్నానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ రేషన్ కార్డులు ఇచ్చిందని, రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ప్రయాణం కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని దీన్ని పార్టీ కార్యకర్తలు ప్రజల వద్దకు తీసుకెళ్లి వివరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యేను ఓడగొట్టడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కార్యకర్తలు సైనికుల్లా పని చెయ్యాలని పిలుపునిచ్చారు

# కాక్రోచ్ తరహాలో క్రిమినల్ వేస్ట్ పార్టీ?

**హైదరాబాద్, ఆగస్టు 3 పెన్ పవర్:**
తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల ఉద్యోగార్హతలు, స్కిల్స్ లోపంపై మాట్లాడుతూ చేసిన క్రిమినల్ వేస్ట్ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర తుఫాను రేపాయి. ఏటా 1.10 లక్షల మంది ఇంజినీరింగ్ పట్టాలు పొందుతున్నా కనీసం ఒక ఉద్యోగ దరఖాస్తు కూడా సొంతంగా నింపలేకపోతున్నారని, ఇది విద్యావ్యవస్థ పరిధిలో క్రిమినల్ వేస్ట్ అని ఆయన వ్యాఖ్యానించడం విమర్శలకు
దారితీసింది. ఈ కామెంట్లపై ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ తో పాటు బీజేపీ నేత ఈటల రాజేందర్ వంటి వారు యువతను కించపర్చారని రేవంత్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ క్రమంలో
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డిలు రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. సీఎం వెంటనే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
చేశారు. ప్రొఫెషనల్ అర్హతలు, కనీస పోటీ పరీక్ష రాసిన అనుభవం లేని సీఎం యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని ఆరోపిస్తూ, జెన్-జీ యువత , ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ వ్యాఖ్యలపై తిరగబడాలని
కేటీఆర్ పిలుపునిచ్చారు. డిజిటల్ మాధ్యమాల్లో రేవంత్ వ్యాఖ్యలపై విద్యార్థుల నిరసనను ఒక రాజకీయ ఉద్యమంగా మార్చేందుకు బీఆర్ఎస్, బీజేపీ సోషల్ మీడియా విభాగాలు వ్యూహాత్మకంగావ్యవహరిస్తున్నాయి.తాజాగా సోషల్ మీడియాలో కాక్రోచ్ అనే పదాన్ని ఒక విమర్శగా ఉపయోగించినప్పుడు, దాన్ని ప్రతిఘటిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఎలా పుట్టుకొచ్చిందో, సరిగ్గా అలాగే ఇప్పుడు రేవంత్‌వ్యాఖ్యలను రీ-బ్రాండ్ చేస్తూ క్రిమినల్ వేస్ట్ అనే ట్యాగ్‌ను విద్యార్థులు ఒక నిరసన చిహ్నంగా మలుచునేలా చేసేందుకు రాజకీయ పార్టీలు ప్రోత్సాహం ఇస్తున్నాయి. మేము క్రిమినల్ వేస్ట్ కాము.. నవతెలంగాణ నిర్మాతలము అనే హ్యాష్‌ట్యాగ్‌లు, మీమ్‌లు, షార్ట్ వీడియోలతో జెన్-జీ తీవ్రస్థాయిలో రీ-కౌంటర్లు ఇస్తోంది. ఈ భావోద్వేగాన్ని ప్రతిపక్షాలు క్యాష్ చేసుకోవడానికి క్రిమినల్ వేస్టే పార్టీ పెట్టేలాయువజన సమూహాలను ఆన్‌లైన్ వేదికగా ప్రోత్సహించేందుకు సిద్ధమవుతున్నాయి.భారత రాజకీయాల్లో ముఖ్యంగా పొలిటికల్ మీమ్‌లతో ఆడుకునే ప్రస్తుత జెన్-జీ తరం ఎప్పటికప్పుడు సరికొత్త
నెరేటివ్‌లను సృష్టిస్తుంది. ఒక వివాదాస్పద పదాన్ని పట్టుకుని దాన్నే ఒక ఐడెంటిటీగా మార్చుకోవడం గ్లోబల్ డిజిటల్ ట్రెండ్. గతంలో కేటీఆర్, ఇతర నేతలు ఉపయోగించిన పదాలను కాంగ్రెస్ ట్రోల్ చేయగా,ఇప్పుడు కాంగ్రెస్ సీఎం వ్యాఖ్యలను బీఆర్ఎస్ అస్త్రంగా మార్చుకుంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై విద్యార్థులు ఆత్మగౌరవ నిరసనలు తెలుపడానికి ప్రతిపక్ష పార్టీలు వెనకుండి బ్యాకింగ్, టెక్నికల్ సపోర్ట్, ట్రెండింగ్‌ప్రోత్సాహాన్ని అందించడం ఖాయంగా కనిపిస్తోంది.అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు ఉద్దేశం విద్యాసంస్కరణలేనని కాంగ్రెస్ వర్గాలు సమర్థిస్తున్నాయి. డిగ్రీలు ఉన్నాస్కిల్స్ లేని విద్యార్థులను తీర్చిదిద్దడానికి జర్మనీ, ఫిన్లాండ్ మోడల్స్‌లో మొదటి రెండేళ్లు బేసిక్ విద్య, చివరి రెండేళ్లు ప్రాక్టికల్ విదేశీ లాంగ్వేజెస్, అప్రెంటిస్‌షిప్ నైపుణ్యాలు ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని
వారు పేర్కొంటున్నారు. అయితే, విధానపరమైన లోపాన్ని ఎత్తిచూపే క్రమంలో వాడిన క్రిమినల్ వేస్ట్ అనే పదం కమ్యూనికేషన్ ఫెయిల్యూర్‌గా మారి, రాజకీయ ప్రత్యర్థులకు రాజకీయ ఆయుధంగా మారింది.

రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు జెన్-జీ అసంతృప్తిని క్రిమినల్ వేస్ట్ ఉద్యమంగా మార్చేందుకు ఎంత ప్రయత్నించినా, అది ఎంతకాలం మనుగడ సాగిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# ప్రజావాణిలో వచ్చిన వినతులను గడువులోగా పరిష్కరించాలి



**భద్రాద్రి కొత్తగూడెం పెన్ పవర్:**
జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి భూ, రెవెన్యూ, ఉపాధి, పెన్షన్లు, గృహ నిర్మాణాలు తదితర సమస్యలపై వినతులను స్వీకరించారు. ప్రజా వినతులను నిర్దేశిత గడువులోగా జాప్యం లేకుండా పరిష్కరించాలని, పారదర్శకమైన పాలన అందిస్తూ అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రంగనాధ్ తప్పిస్తారా !

**హైదరాబాద్, ఆగస్టు 3, పెన్ పవర్:**
హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణల తొలగింపు లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రా చుట్టూ న్యాయపరమైన ముళ్లకంప అల్లుకుంటోంది. కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే లేదా ఒకరి తర్వాతఒకరుగా ఏకంగా ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులు ఈ ఏజెన్సీ తీరుపై, దాని అధిపతి ఐపీఎస్ అధికారి ఎ.వి. రంగనాథ్ వైఖరిపై తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేయడం రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోంది.బుల్డోజర్ సంస్కృతి, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలకు దిగడం, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడం వంటి చర్యలపై న్యాయస్థానం చేసిన ఘాటు వ్యాఖ్యలు హైడ్రా భవిష్యత్తును ప్రశ్నార్థకంలోకి నెట్టాయి.లోతుకుంట భూ వివాదానికి సంబంధించిన కోర్టు ధిక్కరణ కేసులో రంగనాథ్‌ను వెంటనే పదవి నుంచి తప్పించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశించినంది. హైడ్రాను పౌరాణిక రాక్షస మృగంతో పోల్చిన న్యాయమూర్తి, తమను తాము సూపర్ కాప్స్ గా భావించుకోవడం చెల్లదని స్పష్టం చేశారు. కేవలం ఈ ఒక్క బెంచ్ మాత్రమే కాకుండా, ఇతర న్యాయమూర్తులు కూడా వేర్వేరు పిటిషన్లపై విచారణ సందర్భంగా నోటీసులు ఇవ్వకుండా చేపడుతున్న ఆకస్మిక చర్యలను, విచారణాధికారాల అతిక్రమణను తీవ్రంగా తప్పుబట్టారు. స్వయంగా కమిషనర్ రంగనాథ్ దాదాపు 62 కోర్టు ధిక్కరణ కేసుల్లో నిందితుడిగా ఉండటం న్యాయవ్యవస్థ తీవ్రంగా పరిగణించిన అంశంగా మారింది.హైడ్రా చేపట్టిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన డ్రీమ్ ప్రాజెక్టుగా, బ్రాండ్ హైదరాబాద్ పునరుద్ధరణగా ప్రచారం చేసుకున్నారు. ప్రారంభంలో ప్రజల నుంచి, పర్యావరణ వేత్తల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించినప్పటికీ, రోజువారీ కార్యకలాపాల్లో చట్టబద్ధమైన ప్రక్రియను పాటించకపోవడమే ప్రస్తుతం ఏజెన్సీకి గొడ్డలిపెట్టుగా మారింది. ప్రతిపక్షాల విమర్శల కంటే కూడా, న్యాయస్థానాలు వరుసగా ఇస్తున్న ప్రతికూల తీర్పులు, వ్యాఖ్యలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రాజకీయంగా,పాలనాపరంగా పెద్ద సవాలుగా పరిణమించాయిహైకోర్టు ఏకంగా సీఎస్‌ను ఉద్దేశించి న్యాయసమ్మతమైన ఆదేశాలను గౌరవించే అధికారిని నియమించండి అని స్పష్టమైన సూచన చేయడంతో ఇప్పుడు బంతిరేవంత్ రెడ్డి కోర్టులోకి చేరింది. కోర్టు ఆదేశాలను



బేఖాతరు చేసి రంగనాథ్‌ను అదే పోస్టులో కొనసాగిస్తే, అది ప్రభుత్వం , న్యాయవ్యవస్థ మధ్య మరింత ఘర్షణ వాతావరణానికి దారితీసే ప్రమాదం ఉంది.అంతేకాకుండా, ప్రభుత్వం ఆశించిన హైడ్రా అసలు లక్ష్యం పక్కదారి పట్టి, కేవలం చట్టవిరుద్ధమైన ఏజెన్సీగా ముద్రపడే ప్రమాదముంది. ఈ పరిణామాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరితగతిన నిర్ణయంతీసుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎ.వి. రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించి, మరొక అధికారికి బాధ్యతలు అప్పగించడం ద్వారా కోర్టు ఆదేశాలనుగౌరవించినట్లవుతుందని, అలాగే ఏజెన్సీపై పడిన మరకను చెరిపేసి చట్ట పరిధిలోనే ఆక్రమణలపై చర్యలు కొనసాగించవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. రాబోయే రెండు మూడు రోజుల్లో హైడ్రా
నాయకత్వ మార్పుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**రంగనాథ్ పనులకు ఫుల్ పబ్లిసిటీ**

హైదరాబాద్ నగరంలో చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రా చేపట్టిన సంస్కరణల సత్ఫలితాలు ఇప్పుడు క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు దుర్గంధంతో అలమటిస్తూ, ఆక్రమణల కోరల్లో చిక్కుకుని మురుగు నీటి కుంటలా మారిన ఉప్పల్ నల్లచెరువు'.. నేడు కన్నులపండువగా, ఆహ్లాదకరమైన వాతావరణంతో పునరుజ్జీవం పోసుకుంది. చెరువును ఆధునీకరించి, సుందరీకరించిన తీరుపై ఉప్పల్ నివాసితులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల నుంచి హైడ్రా కమిషనర్ రంగనాథ్ , సిబ్బందిపై ప్రశంసల వర్షం కురుస్తోంది.కొన్నేళ్లుగా నల్లచెరువు పరివాహక ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు వేయడం, ప్లాస్టిక్ చెత్తతో నింపేయడం, అక్రమ నిర్మాణాలు వెలియడంతో చెరువు తన అస్తిత్వాన్ని కోల్పోయే స్థితికి చేరింది. వర్షం వస్తే చాలు పరిసర కాలనీలైన
పీఏసీఎస్ కాలనీ, ఉప్పల్ ప్రధాన రహదారులు జలమయమ య్యేవి. ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన హైడ్రా, జీహెచ్‌ఎంసీతో కలిసి సమగ్ర కార్యాచరణను చేపట్టింది. చెరువు పరిధిలోని అక్రమ నిర్మాణాలను తొలగించడమే కాకుండా, టన్నుల కొద్దీ పూడిక, చెత్తాచెదారాన్ని స్వల్పకాలంలోనే తొలగించి చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచింది.చెరువులోకి మురుగునీరు నేరుగా చేరకుండా డైవర్షన్ ఛానెళ్లను
ఏర్పాటు చేసి, గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించారు. చెరువు కట్టను బలపరిచి దాని చుట్టూ వాకింగ్ ట్రాక్, విద్యుత్ దీపాలు, సందర్శకుల కోసం సుందరమైన బెంచీలు, పచ్చదనంతో కూడిన ల్యాండ్‌స్కేపింగ్‌ను తీర్చిదిద్దారు. సాయంత్రం వేళల్లో ఉప్పల్ వాసులు, చిన్నారులు, వృద్ధులు ప్రశాంతంగా గడిపేందుకు ఈ ప్రాంతం ఒక అద్భుతమైన వాకింగ్ అండ్ రీక్రియేషన్ స్పాట్ గా రూపాంతరం
చెందింది.హైడ్రా పనుల పుణ్యమా అని దుర్గంధం, దోమల బెడద నుంచి విముక్తి లభించిందని, ఆస్తి విలువలు కూడా పెరిగాయని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా చెరువు బిఫోర్ -- ఆఫ్టర్ వీడియోలు, ఫోటోలు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. కేవలం కూల్చివేతలకే పరిమితం కాకుండా.. ప్రజాధనం వృథా కాకుండా చెరువులను పునరుద్ధరించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో హైడ్రా తన ప్రత్యేక ముద్రను వేసిందని నెటిజన్లు, ఉప్పల్ వాసులు కొనియాడుతున్నారు.

# కాంగ్రెస్ తో కటీఫ్... మల్లన్న యాక్షన్ ప్లాన్ రెడీ

**హైదరాబాద్, ఆగస్టు 3 పెన్ పవర్:**
చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఇప్పుడు తన రాజకీయ ప్రయాణంలో అత్యంత కీలకమైన సవాలును ఎదుర్కొంటున్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం ఆ పార్టీతో తెగదెంపలు చేసుకుని సొంత రాజకీయం మొదలుపెట్టారు. వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న తన పదవీకాలం ముగిసేలోపు మళ్లీ అదే స్థానం నుంచి స్వతంత్ర వేదిక ద్వారా గెలవాలనే లక్ష్యంతో సుదీర్ఘ పాదయాత్రకు రూపకల్పన చేస్తున్నారు. ఈ కొత్త నిర్ణయం ఆయన భవిష్యత్తును పూర్తిగా మార్చే అవకాశం ఉంది.గతానికి ఇప్పటికి మల్లన్న పొలిటికల్ ఇమేజ్‌లో చాలా స్పష్టమైన మార్పు వచ్చింది. ఒకప్పుడు తీన్మార్ మల్లన్న అంటే డిజిటల్ మీడియా ద్వారా ప్రభుత్వాలను అక్రమాలను ప్రశ్నించే హార్డ్‌కోర్ వాయిస్‌గా యూత్‌లో విశేషమైన ఆదరణ ఉండేది. ఆ ప్లాట్‌ఫామ్ తెచ్చిపెట్టిన క్రేజ్‌తోనే ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినప్పుడే లక్షలాది ఓట్లు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆ తదనంతరం కాంగ్రెస్‌లో చేరి ప్రత్యర్థులను తట్టుకుని ఎమ్మెల్సీ పీఠాన్ని అధిరోహించగలి గారు. కానీ కాలక్రమేణా ఆయన అనుసరించిన విధానాలు మారడంతో ప్రజల్లో ఆయనపై ఉన్న సానుకూల దృక్పథం నెమ్మదిగా కరిగిపోతూ వచ్చింది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత ఆయన ఎంచుకున్న రాజకీయ దారి ఆయన పునాదులనే కదిలించిందనే అభిప్రాయం బలంగావినిపిస్తోంది. బీసీ ఐక్యత పేరుతో కొన్ని వర్గాలను ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తూనే ఇతర కులాలను సమాజంలోని కొన్ని విభాగాలను తీవ్రంగా విమర్శిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఈ చర్యలు ఆయనకున్న
న్యూట్రల్ ఎడ్యుకేటెడ్ ఓటర్ బేస్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. విద్యావంతులు గ్రాడ్యుయేట్లు ఓటేసే ఎమ్మెల్సీ నియోజకవర్గంలో వ్యక్తిగత దూషణల కంటే ఉద్యోగ ఉపాధి అవకాశాలకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. ఈ క్రమంలో మల్లన్న తన పాత ఇమేజ్‌ను పోగొట్టుకుని దారి తప్పిన నాయకుడిగా మిగిలిపోయారనే విమర్శలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి.రాబోయే ఎన్నికల్లో ఆయనకు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలం ఓటు బ్యాంకు అండగా ఉండవు. ప్రధాన పార్టీలు ఈ విస్తృత నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు క్షేత్రస్థాయి నుంచి పక్కా వ్యూహాలు అమలు చేస్తున్నాయి. కాంగ్రెస్ వైపు నుంచి అధికారిక అభ్యర్థి బరిలో ఉంటారు కాబట్టి పోటీ మరింత తీవ్రంగా ఉంటుంది. ఇలాంటి త్రిముఖ లేదా చతుర్ముఖ పోరులో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ లేకుండా కేవలం సొంత ఇమేజ్‌తో బరిలోకి దిగడం పెద్ద సాహసమే. అందుకే పాదయాత్ర ద్వారా మళ్లీ జనం లోకి వెళ్లి కోల్పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించుకోవాలని ఆయన తీవ్రంగా భావిస్తున్నారు.పాదయాత్రలు చేయడం తేలికే అయినా పట్టభద్రుల మైండ్ సెట్‌ను మార్చడం మల్లన్నకు అంత సులభం కాకపోవచ్చు. ఒకవేళ పాదయాత్ర చేసినా కూడా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఓట్లు సాధించలేకపోతే గత కొన్నేళ్లుగా ఆయన చుట్టూ ఉన్న పొలిటికల్
హడావుడి ప్రసహనంలా మారుతుంది. తన పాత ఇమేజ్‌ను తిరిగి తెచ్చుకుని విద్యావంతులను మెప్పించే సరైన అజెండాతో వస్తే తప్ప రాబోయే ఎన్నికల పోరు ఆశాజనకంగా ఉండే అవకాశం లేదు. లేకపోతే ఆయనను పట్టించుకునే వారే కరువవుతారు.

# జెన్ జీ టచ్ లో జనసేన

**కాకినాడ, ఆగస్టు 3, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జెన్ జీ యువత కేంద్రంగా రాజకీయ పరిస్థితులు మారుతున్నాయి. ఈ నేపథ్యంలో జనసేన పార్టీని సైతం అదే ఆధునిక స్థాయిలో తీర్చిదిద్దాలని పవన్ గట్టిగా భావిస్తున్నారు. కేవలం పాత పద్ధతుల్లో కాకుండా మారుతున్న టెక్నాలజీ, సోషల్ మీడియా, సరికొత్త ఆలోచన విధానాలకు అనుగుణంగా పార్టీ యంత్రాంగాన్ని మార్పులు చేస్తున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర అధికార ప్రతినిధుల కమిటీని రద్దు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 మంది నాయకులను వారి బాధ్యతల నుంచి తప్పించారు. నూతన నియామకాలు పూర్తి అయ్యే వరకు టీవీ డిబేట్లు, మీడియా సమావేశాలలో ఎవరూ పాల్గొనవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పార్టీ సంస్థాగత ప్రక్షాళన దిశగా ఈ నిర్ణయం చాలా కీలకమైన అడుగుగా రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ సమూల మార్పులు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రకాశం అలాగే నెల్లూరు జిల్లాల కమిటీలను రద్దు చేసిన అధినాయకత్వం, పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా కొత్త కమిటీల బాధ్యతలను క్షేత్రస్థాయి క్యాడర్ కు అప్పగిస్తోంది. ఈ వరుస నిర్ణయాల కొనసాగింపుగానే ఇప్పుడు రాష్ట్రస్థాయి అధికార ప్రతినిధుల కమిటీని పూర్తిగా రద్దు చేయడం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలలో జనసేనకు ప్రాతినిధ్యం వహిస్తున్న 26 మంది అధికార ప్రతినిధుల బాధ్యతలను హైకమాండ్ ఉపసంహరించుకుంది. కొత్త కమిటీల నియామకం జరిగే వరకు మీడియా ముందుకు వచ్చి మాట్లాడకూడదని కఠిన నిబంధనలు పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి పార్టీని పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయడమే ఈ ప్రక్షాళన ముఖ్య ఉద్దేశం. క్షేత్రస్థాయి నుంచి నాయకులను చురుగ్గా ఉంచడానికి ఈ కఠినమైన నిర్ణయాలు ఎంతగానో ఉపయోగపడతాయని పార్టీ భావిస్తోంది.జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి యువతకు ఎప్పుడూ పెద్దపీట వేస్తూ



వస్తున్నారు పవన్ కళ్యాణ్. అయితే ప్రస్తుత జెన్ జీ ట్రెండ్‌కి తగినట్లుగా పోరాటాలకు సిద్ధంగా ఉండే నాయకత్వాన్ని తయారు చేయాలని కోరుకుంటున్నారు. కొత్త తరపు గొంతుక పార్టీలో స్పష్టంగా వినిపించాలనే లక్ష్యంతో ఈసారి మరింత ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పూర్తిగా ప్రక్షాళన చేసే పనిలో పడ్డ ఆయన కొత్త కమిటీల నియామకం పై సుదీర్ఘంగా కసరత్తు చేస్తున్నారు. ఈసారి కేవలం రాజకీయ నాయకులే కాకుండా చదువుకున్న విద్యాధికులతో పాటు ఐటీ ఉద్యోగులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నారు. అన్ని సామాజిక వర్గాల వారికి తగిన స్థానం కల్పించడం ద్వారా ప్రజల్లోకి బలమైన సంకేతాలు పంపాలని చూస్తున్నారు. వచ్చే నెలలో ఈ కొత్త కమిటీల పూర్తి జాబితాను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. యువత శక్తిని పూర్తిగా వినియోగించుకోవడం ద్వారా పార్టీ భవిష్యత్తును మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో అడుగులు పడుతున్నాయి.దేశ రాజకీయాలను ఇటీవల కాలంలో జెన్ జీ తరహా ఉద్యమాలు ఒక కుదుపు కుదిపేశాయి. ఆ స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీలో యువతతో పాటు చదువుకున్న టెక్కీలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించాలని సమాచారం అందుతోంది.

ముఖ్యంగా ఐటీ రంగానికి చెందిన నిపుణులు, సామాజిక అంశాలపై పూర్తి అవగాహన ఉన్న యువ నాయకులను ప్రోత్సహించి కీలక బాధ్యతలు అప్పగించాలని ఆలోచిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యం ఇస్తూ సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయడమే ఈ కొత్త కమిటీల ప్రత్యేకతగా నిలవనుంది. కేవలం సాంప్రదాయ ధోరణులకు పరిమితం కాకుండా నేటి డిజిటల్ యువతకు సులభంగా అర్థమయ్యే రీతిలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పవన్ కళ్యాణ్ కోరుకుంటున్నారు. ఈ ఆధునిక విధానం ద్వారా యువత పెద్ద ఎత్తున పార్టీ వైపు ఆకర్షితులు అవుతారని, రాబోయే ఎన్నికలలో ఇది పార్టీ విజయానికి ప్రధాన భూమిక పోషిస్తుందని అంతా భావిస్తున్నారు.మార్పు అనేది ఎప్పుడూ ఒక మంచి పరిణామం అని నమ్మే పవన్ కళ్యాణ్, జనసేన పార్టీలో చేస్తున్న ఈ ప్రక్షాళన భవిష్యత్తు రాజకీయాలకు ఒక దిక్సూచి కానుంది. టెక్నాలజీ యుగంలో దూసుకుపోతున్న నేటి తరానికి తగినట్లుగా పార్టీ యంత్రాంగాన్ని సంస్కరించడం ద్వారా సమాజంలో సరికొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలుకుతున్నారు. అనుభవజ్ఞులైన సీనియర్ల మార్గదర్శకత్వంలోనే ఉంటూనే, నిర్ణయాలు తీసుకునే అధికారంలో యువతకు పెద్దపీట వేయడం ఈ కొత్త కమిటీల ప్రధాన ఉద్దేశం. రాబోయే కాలంలో జరగబోయే ప్రతి ఎన్నికను సవాల్‌గా తీసుకుని కూటమి ప్రభుత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని జనసేన శ్రేణులు ఉత్సాహంగా ఉన్నాయి. త్వరలో ప్రకటించబోయే కొత్త రాష్ట్ర కమిటీ జాబితా రాజకీయ వర్గాలలో పెను మార్పులకు కారణం కానుంది. పవన్ కళ్యాణ్ తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయాలు పార్టీని ఏ విధంగా విజయతీరాలకు చేర్చుతాయనేది వేచి చూడాలి. ఏది ఏమైనా ఈ నిర్ణయం యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

# మళ్లీ వల్లభనేనికి కోర్టు తిప్పలు

**విజయవాడ, ఆగస్టు 3, పెన్ పవర్:**
గన్నవరం నియోజకవర్గ రాజకీయాల్లో మట్టి దోపిడీ వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. గత ప్రభుత్వ కాలంలో జరిగిన అక్రమాలను ప్రస్తుత ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బహిర్గతం చేయడం పెద్ద చర్చకు దారితీసింది. పోలవరం కుడి కాలువ మట్టి తవ్వకాలు, ప్రభుత్వ పనుల కాంట్రాక్టులలో సాగిన అవినీతిని ఆయన బయటపెట్టారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పాలనలో జరిగిన ఈ దోపిడీపై విజిలెన్స్ నివేదికలు కూడా స్పష్టమైన నిజాలు వెల్లడించాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కోట్ల విలువైన సహజ వనరులను తరలించారని ఆరోపణలు వస్తున్నాయి. నియోజకవర్గ ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యతతోనే తాను ఈ నిజాలను బయటపెట్టానని యార్లగడ్డ గట్టిగా చెబుతున్నారు. ఈ పరిణామాలు స్థానిక రాజకీయాల్లో పెను మార్పులకు కారణం అవుతున్నాయి.అక్రమాలు బయటపడతాయనే భయంతో మాజీ ఎమ్మెల్యే వంశీ లీగల్ నోటీసుల మార్గాన్ని ఎంచుకున్నారు. తన పరువుకు భంగం కలిగిస్తున్నారంటూ ఆయన పంపుతున్న నోటీసులు కేవలం భయపెట్టే ప్రయత్నాలని కూటమి శ్రేణులు మండిపడుతున్నాయి. గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని సాగించిన అరాచకాలను ప్రజలు ఇంకా మరచిపోలేదు. ఇప్పుడు అధికారం కోల్పోయాక చట్టపరమైన ముసుగులో తప్పించుకోవాలని చూడటం సరికాదని విమర్శకులు అభిప్రాయపడుతున్నాయి. కోర్టుల ద్వారా భయపెట్టి నోరు మూయించవచ్చనే ఆలోచన కేవలం భ్రమేనని స్థానిక నాయకులు స్పష్టం చేస్తున్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా ఇలాంటి బెదిరింపులకు పాల్పడటం మాజీ ఎమ్మెల్యే రాజకీయ బలహీనతను స్పష్టంగా బయటపెడుతోంది.బెదిరింపులకు ఎట్టి పరిస్థితుల్లోనూ



వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ధైర్యంగా ప్రకటిస్తున్నారు. చట్టబద్ధంగా ఏ వేదికపైనైనా ఈ దోపిడీని నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆయన తేల్చిచెప్పారు. కోర్టులకు వెళ్తే అసలు నిజాలు, మట్టి తవ్వకాలకు సంబంధించిన పక్కా ఆధారాలన్నీ బయటకు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించింది నియోజకవర్గాన్ని ప్రక్షాళన చేయడానికే తప్ప ఇలాంటి లీగల్ నోటీసులకు భయపడటానికి కాదని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలోనే తేల్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పడం ద్వారా ఆయన తన పట్టును నిరూపించుకుంటున్నారు. ఈ రాజకీయ పోరు రానున్న రోజుల్లో మరింత ముదిరే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.గన్నవరం నియోజకవర్గ ప్రజలు గత ఐదేళ్ల పాలనలో జరిగిన అన్యాయాలను నిశితంగా గమనించారు.

విమానాశ్రయం పరిసరాల్లో జరిగిన పనులలోనూ భారీ అవకతవకలు జరిగాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రాయల్టీ చెల్లించకుండా తరలించిన వేలాది ట్రక్కుల మట్టి లారీలు రోడ్లను ధ్వంసం చేశాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. యువత ఈ విషయాలను సోషల్ మీడియా వేదికగా విశ్లేషిస్తూ నిలదీస్తున్నారు. పాత తప్పులను కప్పిపుచ్చుకోవడానికి లీగల్ నోటీసులు పంపడం పట్ల ప్రజల్లో వ్యంగ్యమైన చర్చ నడుస్తోంది. అభివృద్ధిని విస్మరించి కేవలం అక్రమ సంపాదన మీద దృష్టి పెట్టడం వల్లే నాయకులు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని యువత భావిస్తున్నారు. ఈ పరిణామాలు రాబోయే రాజకీయ సమీకరణాలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి.మొత్తానికి గన్నవరం రాజకీయం ప్రస్తుతం అత్యంత రసవత్తరమైన దశకు చేరుకుంది. యార్లగడ్డ వెంకట్రావు దూకుడు వల్ల వంశీ వర్గంలో తీవ్ర ఆందోళన నెలకొంది. అవినీతిని అంతం చేసే వరకు విశ్రమించేది లేదనే సంకేతాలను ప్రస్తుత నాయకత్వం బలంగా ఇస్తోంది. సోషల్ మీడియా ట్రెండ్స్ ప్రకారం చూస్తే ఈ వివాదం ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. ప్రజలు కూడా నిజాలు ఎటువైపు ఉన్నాయో స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారు. రానున్న కాలంలో ఈ పోరు కోర్టుల ద్వారా ఏ మలుపు తిరుగుతుందో చూడాలి. గన్నవరం అభివృద్ధి సాధించాలంటే ఇలాంటి అక్రమాలపై నిరంతరం నిఘా అవసరమని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

# పోతిన మహేష్ దారెటు...

**విజయవాడ, ఆగస్టు 3, పెన్ పవర్:**
పోతిన మహేష్ ప్రస్తుతం వైసీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న యువ నాయకుడు. విజయవాడ రాజకీయాల్లో ఎదగాలని ఆయన తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఆయనకు మంచి పట్టు ఉంది. జనసేన పార్టీ ద్వారా రాజకీయ ప్రయాణం ప్రారంభించారు. పవన్ కల్యాణ్ వీరాభిమానిగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఆయన రాజకీయ భవితవ్యం సంకటంలో పడింది. గత ఎన్నికలలో పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆశించారు. కూటమి పొత్తులో భాగంగా ఈ స్థానం బీజేపీకి కేటాయించారు. దీంతో ఆయన తీవ్ర నిరాశకు గురయ్యారు. జనసేన పార్టీ వీడి వైసీపీలో చేరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనూ ఆయనకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదు. భవిష్యత్తు రాజకీయాలపై ఆయన మదనపడుతున్నారు.విజయవాడ పశ్చిమ సీటుపై పోతిన మహేష్ భారీ ఆశలు పెట్టుకున్నారు. గడచిన ఎన్నికలలో టికెట్ రాలేదు. ఇప్పుడు కూడా అదే సీటు కోరుకుంటున్నారు. అయితే వైసీపీలోనూ బలమైన నాయకులు ఉన్నారు. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు మళ్లీ అదే స్థానం ఆశిస్తున్నారు. దీంతో పోతిన మహేష్ పరిస్థితి క్లిష్టంగా మారింది. పార్టీ అధిష్టానం ఆయనకు గుంటూరు పార్లమెంట్ బాధ్యతలు అప్పగించింది. ఆ బాధ్యతల పట్ల ఆయన పెద్దగా ఆసక్తి చూపడం లేదు. తనకు పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ పదవి కావాలని కోరుతున్నారు. పార్టీ పెద్దలు ఆయన డిమాండ్ పట్టించుకోవడం లేదు. సొంత పార్టీలో తగిన గుర్తింపు లభించక సతమతమవుతున్నారు.వైసీపీలో తగిన ప్రాధాన్యం దక్కకపోవడంతో జనసేన నుంచి సంకేతాలు వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పోతిన కోసం జనసేన తలుపులు తెరిచే ఉన్నాయని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఆయనను తిరిగి పార్టీలోకి ఆహ్వానించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. అయితే గతంలో పవన్ కల్యాణ్ కుటుంబంపై పోతిన తీవ్ర విమర్శలు చేశారు. ఈ పరిణామం జనసేనలోని కొందరికి నచ్చడం లేదు. ఆయనను మళ్లీ పార్టీలో చేర్చుకోవడాన్ని కొందరు వ్యతిరేకిస్తున్నారు. పార్టీలో ఆయనకు స్థానం దక్కడం కష్టమని కొందరు నేతలు భావిస్తున్నారు. ఈ రాజకీయ పరిణామాలు ఆయనను తీవ్ర గందరగోళంలో నెట్టేశాయి.ప్రస్తుత రాజకీయ పరిస్థితులు గమనిస్తే పోతిన మహేష్ అడకత్తెరలో చెక్కపడ్డ చందంగా మారారు. వైసీపీలో ఉంటే పశ్చిమ సీటు దక్కేలా లేదు. జనసేనకు వెళితే గత విమర్శల కారణంగా వ్యతిరేకత ఎదురవుతోంది. రెండు పార్టీల మధ్య నలిగిపోతున్న ఆయన భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. విజయవాడ రాజకీయాల్లో తన స్థానం సుస్థిరం చేసుకోవాలని ఆయన తపన పడుతున్నారు. కానీ పరిస్థితులు ఆయనకు అనుకూలంగా మారడం లేదు. అనుచరులు మాత్రం ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారో అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోకపోతే మరింత నష్టపోవాల్సి వస్తుంది.రాజకీయ ప్రయోజనాలు నెరవేరక పోవడంతో పోతిన మహేష్ తీవ్ర మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ప్రత్యర్థుల వ్యూహాల కారణంగా ఆయన నియోజకవర్గంలో ఇబ్బంది పడుతున్నారు. ప్రజల్లోకి వెళ్దామంటే స్పష్టమైన హామీలు కరువయ్యాయి. భవిష్యత్తు కార్యాచరణపై సన్నిహితులతో చర్చిస్తున్నారు. ఏ పార్టీలో కొనసాగాలనేదానిపై త్వరలోనే స్పష్టత ఇస్తారని ప్రచారం జరుగుతోంది. విజయవాడ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ తరుణంలో ఆయన ఎలాంటి అడుగులు వేస్తారో చూడాలి. మొత్తంగా ఆయన రాజకీయం అత్యంత కీలకమైన మలుపు తిరిగింది.

# కష్ట కాలంలో మిత్ర పక్షం: మోడీకి ఇది అవసరం.. !



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం దేశవ్యాప్తంగా నెలకొన్న కొన్ని రాజకీయ పరిణామాలు.. ముఖ్యంగా విద్యార్థి నిరసనలు వంటివి ప్రధాని మోడీకి ఇబ్బందికరంగా మారుతున్నాయి. నీట్ పరీక్ష పేపర్ లీక్ సహా.. అయోధ్య రామయ్య మం దిర విరాళాల చోరీ ఘటన వంటివి రాజకీయాలకు అతీతంగా ప్రజల్లో నిరసనలకు దారి తీశాయి. ఇవి ఒక్క వర్గానికి.. లేదా ఒక కులానికి సంబంధించిన వ్యవహారం కాదు. అన్ని సామాజిక వర్గాల విద్యార్థులు పరీక్షలు రాశారు. అన్ని వర్గాల వారూ.. రాముడికి విరాళాలు ఇచ్చారు.దీంతో ఈ రెండు విషయాలలో జరిగిన తప్పులు.. సహజంగానే కేంద్ర ప్రభుత్వానికి ఇబ్బందిగా మారాయి. ఎన్నడూలేని విధంగా ఒక నిరసన కారణంగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాల్సి వచ్చింది. అయోధ్య రామమందిర ట్రస్టును మార్చుకోవాల్సి వచ్చింది. ఇవన్నీ.. జాతీయస్థాయిలో మోడీ సర్కారుకు తీవ్రసంకటంగా పరిణమించాయి. మరోవైపు ప్రధాని, హోం శాఖ మంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా పార్లమెంటు ఉభయ సభలు దద్దరిల్లుతున్నాయి.ఇలాంటి క్లిష్టమైన పరిస్థితిలో మోడీని సమర్థించే వారు అవసరం. మోడీని మెచ్చుకునేవారు.. ఆయనకు అండగా ఉండే వారు.. అత్యంత అవసరం. ఖచ్చితంగా ఇదేసమయంలో ఏపీ నుంచి మోడీకి బలమైన మద్దతు లభించింది. భోగాపురం వేదికగా టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు, జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు.. ఆయనకు అండగా నిలిచారు. ప్రధానికి మద్దతుగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన ఈ దేశానికి అందివచ్చిన వరమని ప్రశంసలు గుప్పించారు.పైకి చూస్తే.. ఇవి పొగడ్తలుగా అనిపించినా.. కేంద్రం దృష్టిలోను, ముఖ్యంగా ప్రధాని దృష్టిలోను.. ఈ కీలక క్లిష్ట సమయంలో ఆయనకు చంద్రబాబు, పవన్ అందించిన బూస్ట్ అంతా ఇంతా కాదు. దేశవ్యాప్తంగా వ్యతిరేకత పెరుగుతున్నట్టు అంచనా వేసుకుంటున్న సమయంలో అనూహ్యంగా వీరిద్దరూ మద్దతు ప్రకటించడం.. కేంద్ర ప్రభుత్వానికి దన్నుగా మారింది. పైగా.. దక్షిణాదిలో బలమైన రెండు ప్రాంతీయ పార్టీల నుంచి మద్దతు కూడగట్టడం ద్వారా.. ఈ సమయంలో ప్రధానికి బిగ్ రిలీఫ్ వచ్చినట్టు అయిందని అంటున్నారు పరిశీలకులు.

## కంచుకోటలో సవాళ్లు....

**అనంతపురం, ఆగస్టు 3, పెన్ పవర్:**
ఉమ్మడి అనంతపురం జిల్లా ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ కి కంచు కోటగా గుర్తింపు పొందింది. రాజకీయ పరిస్థితులు ఎలా మారినా ఈ ప్రాంతంలో పార్టీ తన ప్రభావాన్ని నిలబెట్టుకుంది. 2019 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేసినప్పటికీ, హిందూపురం , ఉరవకొండ వంటి నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపు సాధించింది. 2024 ఎన్నికల్లో కూడా జిల్లా వ్యాప్తంగా పార్టీ మరింత బలపడింది. అయితే ఇప్పుడు జిల్లాలో పార్టీ నాయకత్వం ఆశించినంత చురుకుగా కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు ఇటీవల రాజకీయ కార్యక్రమాల్లో పెద్దగా కనిపించడం లేదని కార్యకర్తల మధ్య చర్చ జరుగుతోంది. మంత్రి పదవులు లేదా ఇతర కీలక బాధ్యతలు ఆశించిన కొందరికి అవి దక్కకపోవడం, నామినేటెడ్ పోస్టుల భర్తీలో జాప్యం జరగడం వంటి అంశాలు ఈ పరిస్థితికి కారణమయ్యాయనే ప్రచారం ఉంది. అధికారంలో ఉన్నప్పటికీ నాయకులు సమన్వయంతో ముందుకు సాగకపోవడం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక నాయకత్వం తమ తమ వర్గాలకే పరిమితమవుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో పార్టీ కార్యక్రమాలు ఒకే దిశగా సాగడం లేదని పరిశీలకులు చెబుతున్నారు. నాయకుల మధ్య సమన్వయం బలహీనంగా ఉండటం వల్ల కేడర్‌లో కూడా కొంత నిరుత్సాహం కనిపిస్తోందని స్థానికంగా చర్చ జరుగుతోంది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించిన ఇంటింటికీ కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఒకే స్థాయిలో అమలు చేయడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ , కాల్వ శ్రీనివాసులు ప్రాతినిధ్యం వహిస్తున్న రాయదుర్గం నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం కొంత చురుకుగా సాగుతున్నప్పటికీ, మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం ఆశించిన వేగం కనిపించడం లేదని పార్టీ వర్గాలే అంటున్నాయి.చాలా చోట్ల ఇంటింటికీ కార్యక్రమం కంటే సమావేశాలు, సమన్వయ చర్చలు, కార్యకర్తల నియామకాలపైనే ఎక్కువ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో ప్రజల్లో పార్టీ కార్యక్రమాల ప్రభావం తగ్గే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కువ మంది సీనియర్ నాయకులు ఉండటం కూడా సమన్వయానికి సవాలుగా మారిందని అంటున్నారు. ప్రతి నాయకుడు తన రాజకీయ ప్రాధాన్యతను నిలబెట్టుకోవాలనే ప్రయత్నంలో ఉండటంతో కొన్ని చోట్ల అంతర్గత పోటీ పెరిగినట్లు కనిపిస్తోంది. ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతల మధ్య అభిప్రాయ భేదాలు కూడా అప్పుడప్పుడు బయటపడుతున్నాయని సమాచారం.ముఖ్యంగా తాడిపత్రి, హిందూపురం , పెనుకొండ వంటి కీలక నియోజకవర్గాల్లో స్థానిక రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారాయి. ఈ పరిస్థితులను పార్టీ అధిష్ఠానం సమయానికి చక్కదిద్ది, నాయకత్వం మరియు కేడర్‌ను ఒకే వేదికపైకి తీసుకురాగలిగితే జిల్లా స్థాయిలో పార్టీ మరింత బలోపేతం అయ్యే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రస్తుతం నాయకుల మధ్య సమన్వయం పెంచడం, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపడం టీడీపీకి అత్యంత కీలకమైన అంశంగా మారింది.

## పరారీలో వైసీపీ నేతలు

**ఏలూరు, గుంటూరు, ఆగస్టు 3, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో చట్టం తన పని తాను చేసుకుపోతుంటే.. వైఎస్సార్‌సీపీ నేతలలో కనిపిస్తున్న భయం, ఆందోళన రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు చెలరేగిపోయి కేసులు మూటగట్టుకున్న నాయకులు.. ఇప్పుడు విచారణను ఎదుర్కొనే ధైర్యం లేక చాంతాడంత పొడవునా పరారీలో ఉంటున్నారు. ఎక్కువ మంది కొత్త కేసుల్లోనే ఇరుక్కుంటున్నారు. కనిపించకుండా పోతున్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు మద్యం రవాణా టెండర్ల అక్రమాల కేసులో సుప్రీంకోర్టు నుంచి ముందస్తు బెయిల్ రాక తీవ్ర షాక్ తగలడం, చింతాడ రవికుమార్, గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే ముస్తఫా వంటి వారు ఎక్కడ ఉన్నారో తెలియక అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం ఈ సిరీస్‌లో తాజా పరిణామాలు. తమ్మినేని వంటి కొందరు నేతలు అత్యంత ప్రయాస పడి మధ్యంతర బెయిల్ తెచ్చుకుంటుంటే.. మిగిలిన వారంతా పోలీసుల భయంతో దిక్కుతోచని స్థితిలో నక్కి నక్కి బతుకుతున్నారు.అసలు ఇక్కడ విచిత్రమేమిటంటే.. పోలీసులు వీరిని అరెస్ట్ చేయడానికి పెద్దగా ప్రత్యేక వేట ఏమీ సాగించడం లేదు. అయినప్పటికీ, తమ అక్రమాలు ఎక్కడ వెలుగులోకి వస్తాయోనన్న భయంతో ఫోన్లు కూడా వాడకుండా, రహస్య స్థావరాల్లో దాక్కుంటూ నేతలే సొంతంగా నరకం అనుభవిస్తున్నారు. ఈ ఆధునిక డిజిటల్ యుగంలో ఫోన్ లేకుండా, పరివారానికి దూరంగా, నిరంతరం పోలీసుల సైరన్ వినపడితే ఉలిక్కిపడుతూ అజ్ఞాతంలో గడపడం ఏ రాజకీయ నాయకుడికైనా తీవ్రమైన మానసిక వేదన. ముందస్తు బెయిల్ ఇప్పించాలంటూ కోర్టుల చుట్టూ లాయర్లతో పిటిషన్లు వేయిస్తూ, రోజులు లెక్కిస్తూ బతకడం కంటే పెద్ద శిక్ష మరొకటి ఉండదు.వైసీపీ నాయకత్వం గానీ, ఈ పరారీలో ఉన్న నేతలు గానీ అర్థం చేసుకోవాల్సిన ప్రధానమైన అంశం ఒకటుంది. సాంకేతిక పరిజ్ఞానం ఇంతగా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో నిందితులు ఎంతకాలం పారిపోగలరు? ఎక్కడో ఒకచోట ఫోన్ వాడినా, డిజిటల్ ట్రాన్సాక్షన్ చేసినా లేదా మూడో వ్యక్తితో మాట్లాడినా పోలీసులు సులభంగా ట్రాప్ చేయగలరు. పోలీసులకు పట్టుబడకుండా శాశ్వతంగా తప్పించుకోవడం అసాధ్యమనే విషయాన్ని గుర్తించకుండా, కోర్టులు ముందస్తు బెయిల్ ఇచ్చే వరకు అజ్ఞాతంలో ఉంటామనడం కేవలం స్వయంకృతాపరాధమే.నిజానికి చట్టాన్ని గౌరవించి ధైర్యంగా వెళ్లి పోలీసుల ముందు లొంగిపోతే .. మహా అయితే రిమాండ్‌కు పంపి జైలులో పెడతారు. కేసు తీవ్రతను బట్టి వారం లేదా పది రోజుల్లో సాధారణ బెయిల్ వచ్చే అవకాశాలు మెండుగా ఉంటాయి. ఆ చట్టపరమైన మార్గాన్ని వదిలేసి, రోజూ అరెస్ట్ అవుతామేమోనన్న భయంతో ముళ్ల కంచె మీద గుడ్డ వేసుకున్నట్లు పరారీలో రోజులు గడపడం వ్యూహాత్మకంగా పెద్ద పొరపాటు. ఒకవైపు సుప్రీంకోర్టు కూడా తీవ్రమైన ఆరోపణలు, ఆర్థిక నేరాలు ఉన్న కేసుల్లో కస్టడీ విచారణ అవసరమని స్పష్టం చేస్తూ ముందస్తు బెయిళ్లను తిరస్కరిస్తోంది. ఈ పరిణామాలైనా వైసీపీ నేతలకు కళ్లు తెర్పించాలి. గతం చేసిన తప్పులకు భయపడి అడవుల్లోనో, పక్క రాష్ట్రాల్లోనో నక్కి నక్కి బతికే కన్నా.. చట్టం ముందు హాజరై, లొంగిపోయి న్యాయపోరాటం చేయడమే రాజకీయ నాయకులకు, వారి భవిష్యత్తుకు శ్రేయస్కరం. అది వారు అర్థం చేసుకోలేకపోతున్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## బ్రిజ్ భూషణ్ ను నిర్దోషిగా ప్రకటించిన కోర్టు.. వ్యవస్థ అతడిని రక్షిస్తోంది అన్న వినేశ్ ఫొగాట్



మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు, బీజేపీ నేత బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో బిగ్ రిలీఫ్ లభించింది. ఈ కేసులో ఆయనపై వచ్చిన ఆరోపణలకు తగిన ఆధారాలు లేకపోవడంతో కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. దాదాపు మూడేళ్లుగా దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన ఈ వ్యవహారంలో ఈ తీర్పు ఒక కీలక పరిణామంగా మారింది.

**మూడేళ్ల సుదీర్ఘ వివాదం.. జంతర్ మంతర్ వద్ద నిరసనలు**

2023 ప్రారంభంలో ప్రముఖ ఒలింపియన్లు వినేశ్ ఫొగాట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియాతో పాటు పలువురు మహిళా రెజ్లర్లు బ్రిజ్ భూషణ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన తమపై మానసికంగా, లైంగికంగా వేధింపులకు పాల్పడ్డారని పేర్కొంటూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నెలల తరబడి భారీ ఆందోళనలు నిర్వహించారు. ఈ నిరసనలు క్రీడా రంగాన్నే కాకుండా.. దేశ రాజకీయాలను సైతం తీవ్రంగా కుదిపేశాయి. ఆ సమయంలో పోలీసులు బ్రిజ్ భూషణ్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు.

**కోర్టు తీర్పుపై వినేశ్ ఫొగాట్ తీవ్ర ఆగ్రహం**

తీర్పు అనంతరం ఒలింపియన్ వినేశ్ ఫొగాట్ తన తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వ్యవస్థ మొత్తం బ్రిజ్ భూషణ్‌ను కాపాడేందుకే పనిచేస్తోందని ఆమె విమర్శించారు. "న్యాయవ్యవస్థపై మాకు నమ్మకం ఉంది, కానీ ఈ తీర్పు మమ్మల్ని తీవ్రంగా నిరాశపరిచింది. వ్యవస్థ బ్రిజ్ భూషణ్‌ను రక్షిస్తోంది. అయినప్పటికీ మహిళా రెజ్లర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గరు. న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది." అని వినేశ్ ఫొగాట్ స్పష్టం చేశారు. ఈ కేసు ఇంతటితో ముగియలేదని.. అవసరమైతే హైకోర్టును ఆశ్రయిస్తామని ఆమె స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు.

**సత్యమే గెలిచిందన్న బ్రిజ్ భూషణ్**

మరోవైపు కోర్టు తీర్పుపై బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ తీవ్ర సంతృప్తి వ్యక్తం చేశారు. తనపై వచ్చిన ఆరోపణలన్నీ కేవలం రాజకీయ ప్రేరేపితమైనవని, నిరాధారమైనవని ఆయన పునరుద్ఘాటించారు. కష్టకాలంలో తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ, న్యాయవ్యవస్థకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**ముందుముందు మరో న్యాయపోరాటం?**

కోర్టు తీర్పుతో బ్రిజ్ భూషణ్‌కు తాత్కాలికంగా ఉపశమనం లభించినప్పటికీ, బాధితులు, రెజ్లర్లు పైకోర్టుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ వివాదం త్వరలోనే హైకోర్టు మెట్లు ఎక్కే అవకాశం ఉందన్ని, మరో విడత సుదీర్ఘ న్యాయపోరాటం తప్పదని క్రీడా, రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## 'విలేజ్ కుకింగ్ ఛానల్'.. యూట్యూబ్‌తో లక్షల ఆదాయం.. పెరియతంబి విజయగాథ ఇదే!



ప్రతిభకు, కష్టపడే తత్వానికి భాషా సరిహద్దులు లేవని నిరూపించింది తమిళనాడుకు చెందిన 'విలేజ్ కుకింగ్ ఛానల్'. సాధారణ గ్రామీణ జీవనశైలి, సంప్రదాయ పద్ధతుల్లో భారీ స్థాయిలో చేసే వంటలు, వాటన్నింటికీ మించి పదిమందికి పెట్టే దాతృత్వం.. ఈ ఛానల్‌ను ప్రపంచ వేదికపై అగ్రస్థానంలో నిలబెట్టాయి. ఈ అద్భుత విజయ ప్రస్థానానికి ప్రధాన ఆకర్షణ.. ఆ ఛానల్ పెద్ద దిక్కు అయిన 'పెరియతంబి'.

**ప్రయాణం మొదలైందిలా..**

ప్రారంభంలో సరదాగా పెరియతంబి చేసే సంప్రదాయ గ్రామీణ వంటకాలను వీడియోలు తీసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం ప్రారంభించారు. నాటు కోడి చికెన్, మటన్, చేపల పులుసు, బిర్యానీలు.. ఇలా పెద్ద పెద్ద పాత్రల్లో వందలాది మందికి సరిపడా వంటలు చేసే ఆయన తీరు నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంది. దానికి వచ్చిన అపారమైన ఆదరణతో కుటుంబ సభ్యులు, గ్రామంలోని మిత్రులను కలుపుకొని అధికారికంగా 'విలేజ్ కుకింగ్ ఛానల్'ను నెలకొల్పారు.

**సేవా గుణమే అసలైన విజయం**

ఈ ఛానల్ సాధించిన విజయం కేవలం రుచికరమైన వంటలకే పరిమితం కాలేదు. తాము వండిన ఆహారాన్ని పేదలు, అనాథలు, వృద్ధులు,ఆకలితో ఉన్న వారికి ఆప్యాయంగా పంపిణీ చేయడమే వీరిని ప్రత్యేకంగా నిలబెట్టింది. వీరు చేసే ప్రతి వీడియో చివరలో వందలాది మంది ఆకలి తీర్చడమే ఈ ఛానల్‌కు ప్రపంచవ్యాప్తంగా కోట్ల సంఖ్యలో అభిమానులను తెచ్చిపెట్టింది.

**మైలురాళ్ళు.. గుర్తింపులు**

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్వయంగా ఈ బృందంతో కలిసి వెజిటేబుల్ బిర్యానీ వండి, వారితో కలిసి భోజనం చేయడం ఈ ఛానల్ చరిత్రలోనే ఒక ప్రత్యేక ఘట్టం. భారత్‌లోనే కాక దుబాయ్ వంటి దేశాల్లో కూడా వీరు తమ వంటకాలతో సంచలనం సృష్టించారు. ప్రస్తుతం ఈ ఛానల్‌కు యూట్యూబ్‌లో 30.8 మిలియన్లకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. యూట్యూబ్ రెవెన్యూ, బ్రాండ్ ప్రమోషన్ల ద్వారా నెలకు సుమారు రూ. 11 లక్షల నుండి రూ. 15 లక్షల వరకు ఆదాయం గడిస్తూ గ్రామీణ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

**స్ఫూర్తిదాయక సందేశం**

ఏలాంటి భారీ హంగులు, గ్లామర్ లేకపోయినా.. స్వచ్ఛమైన మనస్సు, పల్లెటూరి వాతావరణం, తోటివారికి సహాయం చేసే గుణం ఉంటే ప్రపంచాన్ని జయించవచ్చని పెరియతంబి, ఆయన బృందం నిరూపించారు. నలుగురికీ కడుపునిండా అన్నం పెడుతూ తమ జీవితాలనూ బంగారంగా మార్చుకున్న ఈ 'విలేజ్ కుకింగ్ ఛానల్' ప్రయాణం, సొంతంగా ఏదైనా సాధించాలనుకునే ప్రతి ఒక్కరికీ ఒక గొప్ప స్ఫూర్తిదాయక కథనం.

## ఏపీలో మున్సిపల్ ఎన్నికలకు అడ్డంకి ఎవరు... ?



ఏపీలో స్థానిక సంస్థలు.. మరీ ముఖ్యంగా పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం రెడీ అవుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల సరిహద్దుల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను స్థానిక ప్రజల తప్పుపట్టారు. అభ్యంతరాలు చెప్పారు. కోర్టులకు వెళ్లారు. ఈ విలీన ప్రక్రియలు ఇప్పుడు మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల ఎన్నికలకు ప్రధాన అడ్డంకిగా మారాయి. స్థానిక ప్రజలకు ఇష్టం లేకుండానే కొన్ని గ్రామాలను బలవంతంగా మున్సిపాల్టీలో విలీనం చేయడం.. సరిహద్దులు మార్చడం చేశారు. ఈ న్యాయపరమైన చిక్కులు ఇప్పుడు స్థానిక ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వానికి పెద్ద అడ్డంకిగా మారాయి. ఏపీ మున్సిపల్ చట్టంలోని 5 చట్టం లేదా మున్సిపల్ చట్టాలకు అనుగుణంగా గ్రామాలను మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో విలీనం చేశారు. ఈ నిబంధనల ప్రకారం ఓ గ్రామాన్ని దానికి దగ్గర్లో ఉన్న మున్సిపాల్టీలో విలీనం చేసినప్పుడు పబ్లిక్ హియరింగ్, సర్పంచ్ ఆమోదంతో పాటు గ్రామసభ ఆమోదం తప్పక ఉండాలి. అలాగే నోటిఫికేషన్ రిలీజ్ చేయడంతో పాటు దానికి తగినంత గడువు కూడా ఇవ్వాలి. పై నిబంధనలు అన్నీ తప్పక పాటించాకే గ్రామాల విలీన ప్రక్రియ జరగాలి. గత ప్రభుత్వం కొన్ని గ్రామాలను మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో కలిపే ప్రక్రియలో పై ప్రక్రియ పూర్తిగా పక్కన పెట్టేసి స్థానిక వైసీపీ నాయకుల ఇష్టారాజ్యం మేరకు వెళ్లిందన్న విమర్శలు ఉన్నాయి.

పంచాయతీ పాలనలో స్థానికంగా పట్టు కోల్పోవడానికి ఇష్టపడని వారు.. కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో విలీనం అయితే స్థానికంగా తమ ఆధిపత్యం కోల్పోతామని భావించే వారు, పన్నుల భారం పెరుగుతోందని భావించిన గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలా 15కు పైగా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో ఎన్నికలు నిలిచిపోవడం లేదా పెండింగ్‌లో ఉండడానికి పైన చెప్పుకున్నవే కారణాలుగా కనిపిస్తున్నాయి. కీలకమైన కాకినాడ, రాజమహేంద్రవరం, నెల్లూరు, మంగళగిరి – తాడేపల్లి, గుంటూరు, విశాఖపట్నం పరిధిలోని పలు విలీన గ్రామాలు సహా కొత్తగా నోటిఫై చేసిన పలు నగర పంచాయతీలకు కూడా ఎన్నికలు జరగకుండా కోర్టుల కేసులు ఉన్నాయి. పైన పేర్కొన్న స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగాలంటే ముందుగా కేసులు అన్నీ పరిష్కారం అవ్వాలి. లేదా స్థానిక ప్రజలకు ఆమోద యోగ్యంగా ఉండేలా సరిహద్దులను మార్చాల్సి ఉంటుంది. వీటిని అన్నింటిని అధిగమించాలంటే ప్రభుత్వం చట్టం 5కు సవరణలు చేయడం లేదా ఇంతకు ముందు ప్రభుత్వం ఇచ్చిన విలీన నోటిఫికేషన్లను మరోసారి పునః సమీక్షించాలని భావిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తికాకపోతే కేంద్రం నుంచి వచ్చే డవలప్‌మెంట్ ఫండ్స్ అన్నీ ఆగిపోతాయి. ఈ క్రమంలోనే ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ వివాదాలు అన్నీ పరిష్కరించుకుని త్వరగా స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

## వైసీపీ మాజీ ఎంపీ అరెస్టు.. మాజీ మంత్రి హౌస్ అరెస్టు!



వైసీపీ కీలక నాయకుల అరెస్టుల పర్వం కొనసాగుతోంది. గత 15 రోజుల్లో ముగ్గురిని అరెస్టు చేయడం వైసీపీలో కలకలానికి దారితీసింది. కుమారుడి రోడ్డు ప్రమాదం కేసులో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ను అరెస్టు చేశారు. టీడీపీ నేత ఇంటిపై దాడి చేసిన కేసులో వైసీపీ ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని పోలీసులు జైలుకు పంపించారు. తాజాగా అనంతపురం జిల్లా హిందూపురం వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అదే సమయంలో ఇదే జిల్లా పెనుకొండలో మాజీ మంత్రి శంకర నారాయణ హౌస్ అరెస్ట్ చేశారు.

**ఎందుకు?**

తాజా అరెస్టుల వెనుక.. వైసీపీ నాయకులు చేపట్టిన నిరసనలే కారణమని పోలీసులు చెబుతున్నారు. ఆలూరు ఎమ్మెల్యే, బీసీ నేత విరూపాక్షిని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో అనంతపురంలో నాయకులు సోమవారం రోడ్డెక్కారు. అయితే.. నిరసనలకు అనుమతి లేదని పేర్కొంటూ.. గుంతకల్ సబ్ డివిజన్‌లో పోలీస్ యాక్ట్–30 అమలులోకి తీసుకువచ్చారు. అయినప్పటికీ.. వైసీపీ నేతలు నిరసనకు దిగడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. అయితే.. పోలీసులు.. తమ నిరసనలను అడ్డుకుంటున్నారని.. ధర్నా నిర్వహిస్తామంటూ ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి వీడియో విడుదల చేశారు. దీంతో ఆయనను కూడా హౌస్ అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఇక, జిల్లా వ్యాప్తంగా పోలీసులు అదనపు బలగాలను రంగంలోకి దింపారు. నిరసన లు, ధర్నాలకు అనుమతి లేదని పేర్కొన్నారు. అయినా.. బయటకు వస్తే.. అరెస్టులు తప్పవని హెచ్చ రించారు. ఇదిలావుంటే.. టీడీపీ నాయకులు కూడా నిరసనలకు దిగారు.

**పోటా పోటీగా..**

బీసీలపై దాడులు చేస్తున్నారని.. వారిని అరెస్టు చేస్తున్నారని ఆరోపిస్తూ.. వైసీపీ నాయకులు నిరసనలు చేపట్టగానే... దీనికి ప్రతిగా టీడీపీ

నాయకులు కూడా నిరసనలు, ధర్నాలకు దిగారు. గత ప్రభుత్వంలో బీసీలపై దాడులు జరిగాయని, చాలా మందిని చంపేశారని ఆరోపిస్తూ.. వాటికి వ్యతిరేకంగా టీడీపీ నేతలు నిరసన చేపట్టారు. వీరికి కూడా పోలీసులు నోటీసులు ఇచ్చారు. అదేసమయంలో అనంతపురం జిల్లాలో దేవాలయ భూముల పరిరక్షణకు మరో నిరసన కార్యక్రమాన్ని బీజేపీ చేపట్టింది. ఇలా.. అనంతపురంలో సోమవారం మూడు పార్టీల నాయకులు నిరసనకు దిగడంతోపోలీసులు అలెర్ట్ అయ్యారు.

## కేరళంలో తిష్ట వేసిన వరుణుడు! భారీ వర్షాలకు కరుగుతున్న కొండలు



కేరళం రాష్ట్రంలో కొద్దిరోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. కుండపోత వర్షాలకు రాష్ట్రంలో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా కొండ ప్రాంతాలు, హిల్ స్టేషన్లలో కొండ చరియలు విరిగిపడుతున్నాయి. ఉన్నపళంగా వరద చుట్టుముట్టడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వర్ష బీభత్సంతో బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపడుతోంది. భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో పలువురు నిరాశ్రయులయ్యారు. ముఖ్యంగా కొట్టాయం, ఇడుక్కి, మలప్పురం, వాయనాడ్ జిల్లాల్లో కొండచరియలు ఇళ్లపై పడటంతో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నదులు, వాగులు ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తుండటంతో తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కన్నూరు, కోజికోడ్ జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ వెల్లడించింది. వర్ష ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు భారీ ఎత్తున సహాయక చర్యలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 209 సహాయ శిబిరాల్లో 5,792 మందికి పైగా బాధితులకు ఆశ్రయం కల్పించారు. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, అగ్నిమాపక సిబ్బంది స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపడుతున్నారు. పలుచోట్ల ఇళ్లు పూర్తిగా, మరికొన్ని చోట్ల పాక్షికంగా ధ్వంసమవడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కేరళ ప్రభుత్వం అత్యంత అప్రమత్తమైంది. పరిస్థితుల తీవ్రత దృష్ట్యా రాష్ట్రంలోని 12 జిల్లాల్లోని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, ముఖ్యంగా కొండచరియలు విరిగిపడే ప్రమాదమున్న హిల్ స్టేషన్లు, కొండ ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత శిబిరాలకు తరలించే ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

కేరళలో కురుస్తున్న దారుణ వర్షాలకు సంబంధించిన భయానక దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఉప్పొంగుతున్న నదులు, రోడ్లపైకి చేరిన భారీ వరద నీరు, కొండచరియలు విరిగిపడి

నేలకూలిన ఇళ్లు, జలదిగ్బంధంలో చిక్కుకున్న ప్రాంతాలకు సంబంధించిన వీడియోలు నెటిజన్లను కలచివేస్తున్నాయి. వర్షాల తీవ్రత తగ్గిన ప్రాంతాలలో ఇళ్లలోకి చేరిన బురదను తొలగించే పనిలో, శుభ్రత కార్యక్రమాలలో అధికార యంత్రాంగంతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు నిమగ్నమయ్యాయి. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, నష్టపోయిన ప్రతి కుటుంబానికి తక్షణ సాయం అందిస్తామని సీఎం కార్యాలయం భరోసా ఇచ్చింది.

## సంపాదకీయం

## శాంతికోసం భారత్!

మనం ప్రస్తుతం మూడో ప్రపంచ యుద్ధం మధ్యలో ఉన్నామా? అనే ప్రశ్న విశ్లేషకుల చర్చల్లో తలెత్తుతోంది. ఐరోపాలో మొదలైన యుద్ధం ఇప్పుడు ఉత్తర కొరియా బలగాలు రంగంలోకి దిగడం, రష్యాకు చైనా మద్దతు కొనసాగించడంతో యురేషియా స్థాయి సంఘర్షణగా విస్తరించింది. పశ్చిమ ఐరోపా, అమెరికా మద్దతుతో ఉక్రెయిన్ ఇంకా పోరాటంలో నిలదొక్కుకుంటోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దృష్టి మళ్లినప్పుడల్లా తీవ్రతరమయ్యే పశ్చిమాసియా సంఘర్షణ అనేక దేశాలను తనలో లాగేసుకుంది. లాటిన్ అమెరికాలో వెనెజువెలాపై అమెరికా సైనిక ఉనికిని నెలకొల్పడం, క్యూబాపై దిగ్బంధనం విధించడం గమనార్హం. ఆఫ్రికాలోనూ ఉత్తర, తూర్పు ప్రాంతాలు ఏదోక సంఘర్షణలో చిక్కుకున్నాయి. భారత్‌కు తూర్పున ప్రస్తుతానికి యుద్ధం లేకపోయినా, ఈ ప్రాంత దేశాలు రెండు ప్రధాన సంఘర్షణల్లోకి పరోక్షంగా లాగబడుతున్నాయి. ఉత్తర కొరియా ప్రత్యక్షంగా చేరగా, జపాన్ నాటో మిత్రదేశంగా నిలిచింది, పాకిస్థాన్ పశ్చిమాసియా సంఘర్షణలో అనేక రకాలుగా ఇమిడిపోయింది. హిందూ మహాసముద్ర ప్రాంతంలోకి అమెరికా యుద్ధనౌకలు ప్రవేశించడం, ఈ రెండు ప్రధాన యుద్ధాల్లో భారతీయులు మరణించడంతో మనదేశం కూడా పరోక్ష నష్టాన్ని చవిచూసింది. అయితే, మొదటి రెండు ప్రపంచ యుద్ధాలతో పోలిస్తే ఇప్పటి పరిస్థితిని పోల్చడం సరికాదు. అప్పుడు ప్రత్యర్థి దేశాల సైన్యాలు నేరుగా తలపడి, కోట్లాది మంది ప్రాణాలు కోల్పోయారు. నగరాలు నేలమట్టమయ్యాయి. ఇప్పటి సంఘర్షణల్లో ప్రత్యక్ష విధ్వంసం ఆయా దేశాలకే పరిమితమైనా, ఇంధనం, ఆహార ధరల పెరుగుదల, ప్రపంచ వాణిజ్య అంతరాయాల రూపంలో ఆర్థిక మూల్యాన్ని యావత్ ప్రపంచం చెల్లిస్తోంది. జీ7 దేశాలు ఆర్థిక వ్యవస్థ, ఇంధనం, వాణిజ్యాన్ని ఆయుధాలుగా మలచుకోవడంతో.. భారత్‌తో సహా అనేక దేశాల పౌరులు సంఘర్షణ ప్రాంతాల్లో ఉపాధి కోసం చిక్కుకుని ప్రాణాలు కోల్పోతున్నారు.


భారత్‌కు తూర్పు, ఆగ్నేయాసియా ప్రాంతాల్లో ఇప్పటికీ సాపేక్ష శాంతి నెలకొని ఉంది, తైవాన్ జలసంధిలో చైనా కూడా ప్రస్తుతానికి సంయమనం పాటిస్తోంది. అయినప్పటికీ, ఈ ప్రాంత దేశాలు రక్షణ వ్యయాన్ని, యుద్ధ సన్నద్ధతను గణనీయంగా పెంచుకుంటున్నాయి. ట్రంప్ వాణిజ్య దాడిని, విస్తృత ఆంక్షల విధానాన్ని ఎదుర్కొంటూనే, భారత్ అమెరికాతో పాటు రష్యాతోనూ రక్షణ సంబంధాలను కొనసాగిస్తోంది. రక్షణ వ్యయాన్ని పెంచుకోవడంతో పాటు, యుద్ధంలో పాలుపంచుకుంటున్న ఇజ్రాయెల్‌కు ఆయుధాలు విక్రయిస్తూ, వివిధ ఆసియా దేశాలకు బ్రహ్మోస్ క్షిపణులను ఎగుమతి చేస్తూ భారత్ తన స్థానాన్ని పటిష్ఠం చేసుకుంటోంది. గతంలో రెండు ప్రపంచ యుద్ధాల్లో బ్రిటిష్ సామ్రాజ్యం తరపున భారతీయ సైనికులు ఐరోపా, ఆసియా యుద్ధభూముల్లో ప్రాణాలర్పించారు. నేడు భారత సైనికులు నేరుగా యుద్ధరంగంలో లేకపోయినా, ఈ రెండు యుద్ధాల పర్యవసానంగా భారతీయ పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారు. మరీ ముఖ్యంగా, ఇంధనం, ఆహార ధరల పెరుగుదల, సరఫరా అంతరాయాలు, తయారీ–సేవల రంగాలకు ప్రపంచ డిమాండ్ తగ్గడం వంటివి భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపాయి. పెద్దనోట్ల రద్దు, కోవిడ్–19 మహమ్మారి పరిణామాల నుంచి ఇంకా పూర్తిగా కోలుకోని భారత్, ఇప్పుడు ఈ రెండు యుద్ధాల భారాన్నీ మోస్తోంది. ఈ నేపథ్యంలో, ఈ రెండు సంఘర్షణలనూ ముగించడంలో భారత్‌కు గణనీయమైన వాటా ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ ఒకప్పుడు 'ఇది యుద్ధాల యుగం కాదు' అని ప్రముఖంగా ప్రకటించారు. అయితే ఉభయ సంఘర్షణల్లోనూ ఇరు వర్గాలతో స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉండటంవల్ల, జోక్యం చేసుకుని మార్పు తీసుకురాగల భారత సామర్థ్యం పరిమితమైంది. రష్యాతో సంబంధాలు యూరోపియన్ యూనియన్, అమెరికాతో సంబంధాల మాదిరిగానే భారత్‌కు కీలకం –ఉక్రెయిన్ అంశం అంతగా ప్రాధాన్యత లేనిదిగా మిగిలింది. పశ్చిమాసియాలోనూ అన్ని పక్షాలతో సంబంధాలు కొనసాగించడంలోనే భారత్ ప్రయోజనం ఇమిడి ఉంది.

ప్రస్తుతం భారత్ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ)లో శాశ్వతేతర సభ్యత్వం కోసం 2028–29 కాలానికి అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది. ఈ దశలో ఇంత ఆలస్యంగా బరిలోకి దిగడానికి కారణం స్పష్టంగా లేకపోయినా, ఈ అవకాశాన్ని భారత్ ప్రపంచ శాంతి కార్యకర్తగా తన స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి వినియోగించుకోవచ్చని కొందరు విశ్లేషకుల అభిప్రాయం. ఉక్రెయిన్, గల్ఫ్ సంఘర్షణలు రెండింటినీ ముగించే దిశగా ప్రపంచ దేశాల కూటమిని నిర్మించే దార్శనికతను భారత నాయకత్వం ముందుకు తేగలదా అన్నది ప్రశ్న. అదే సమయంలో, అమెరికా, రష్యా, చైనావంటి ప్రధాన శక్తులు తమ పరిసర ప్రాంతాల్లో అంతర్జాతీయ చట్టాన్ని, ఐరాస చార్టర్‌ను గౌరవించాలని కూడా భారత్ నొక్కి చెప్పాల్సిన అవసరముంది. ఈ ఏడాది సెప్టెంబర్ 12–13 తేదీల్లో న్యూఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ సదస్సుకు హాజరుకానున్నారని వార్తలొస్తున్నాయి. రష్యా, ఇరాన్‌లు యుద్ధాల్లో ప్రత్యక్షంగా పాలుపంచుకున్నా, మిగతా బ్రిక్స్ దేశాలన్నింటికీ మరింత శాంతియుత, స్థిరమైన ప్రపంచ వాతావరణంలోనే ప్రయోజనం ఉంది.

భారత నాయకత్వం ప్రపంచ శాంతికి ఒక దార్శనికతను ప్రతిపాదించి, ఉక్రెయిన్–గల్ఫ్ సంఘర్షణలు రెండింటినీ ముగించాలని కోరుకునే దేశాల కూటమిని నిర్మించగలదా? ఇది సాధ్యం కావాలంటే, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లోని అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలతో కలిసి పనిచేయడంతో పాటు, ప్రపంచ పౌరుడిగా భారత్ తనను తాను పునర్నిర్వచించుకోవాల్సి ఉంటుందని కొందరి అభిప్రాయం. తన పౌరులను వేధించే, భయపెట్టే దేశంగా కాకుండా.. ప్రజాస్వామిక, ఉదారవాద విలువలపై నిబద్ధతే 1950–60ల్లో భారత రాజకీయ నాయకత్వానికి ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిపెట్టింది. దేశీయ రాజకీయాల్లో వచ్చిన కొత్త మలుపుల కారణంగా భారత ప్రయోజనాలపై ప్రపంచం క్రమంగా అంత సానుకూలంగా లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇది అందరూ ఏకీభవించే అంశం కాదు. ఏదేమైనా, పెరుగుతున్న ఆర్థిక, రక్షణ శక్తితో పాటు, శాంతి కోసం స్పష్టమైన గొంతుకగా నిలవడం ద్వారానే భారత్ ప్రపంచ వేదికపై తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకోగలదన్నది నిర్వివాదాంశం.

---

### పనికొచ్చే పలుకు



## దేన్ని మార్చగలరో దాన్నే పట్టుకోండి!

జీవితంలో ఎన్నో సందర్భాల్లో మనం జరిగిపోయిన తప్పులు, ఇతరుల ప్రవర్తన, వాతావరణం, గతంలాంటి మనం మార్చలేని విషయాల గురించి ఆలోచిస్తూ కుమిలిపోతుంటాం. కానీ ఎంత ఆలోచించినా, ఎంత బాధపడినా అవి మారవు. దీనివల్ల జరిగేది ఒక్కటే – మన మానసిక శక్తి, సమయం వృథా అవడం. నిజమైన జ్ఞానులు ఎప్పుడూ తమ దృష్టిని తాము మార్చగలిగే విషయాలపైనే కేంద్రీకరిస్తారు. ఇదే జీవితంలో నిజమైన పురోగతికి పునాది.

మన చేతుల్లో ఏముంది? మన ఆలోచనలు, మన ప్రయత్నాలు, మన ప్రతిస్పందన విధానం, మన అలవాట్లు –ఇవే మనం నియంత్రించగలిగేవి. ఉదాహరణకు ఎవరైనా మనల్ని విమర్శిస్తే, ఆ విమర్శను మార్చలేం, కానీ దానికి ఎలా స్పందించాలో మాత్రం మనమే నిర్ణయించుకోగలం. ఒక పరీక్షలో ఫలితం ఇప్పటికే వచ్చేసిందంటే దాన్ని మార్చలేం, కానీ రేపటి పరీక్షకు ఎలా సిద్ధం కావాలో మన చేతుల్లోనే ఉంటుంది. ఈ చిన్న దృక్కోణ మార్పే జీవితాన్ని సులభతరం చేస్తుంది.

పురాతన స్టోయిక్ తత్వవేత్త ఎపిక్టెటస్ చెప్పిన మాట ఇక్కడ గుర్తుచేసుకోవాలి – *It's not what happens to you, but how you react to it that matters* (మీకు ఏం జరిగిందన్నది కాదు, దానికి మీరు ఎలా స్పందిస్తారన్నదే ముఖ్యం). ఈ ఒక్క వాక్యం మనిషి జీవనశైలిని పూర్తిగా మార్చే శక్తి కలిగినది. ఎందుకంటే మనం నియంత్రించలేని పరిస్థితులపై పోరాడుతూ శక్తిని హరించుకోవడం మానేసి, మన ప్రతిస్పందనపై దృష్టి పెట్టినప్పుడు, ఒత్తిడి తగ్గి, స్పష్టత పెరుగుతుంది. ఈ సూత్రాన్ని దైనందిన జీవితంలో అన్వయించుకుంటే –ట్రాఫిక్‌లో ఆలస్యమైతే కోపగించుకోవడం కంటే, ఆ సమయాన్ని ఆడియో పుస్తకం వినడానికో, ప్రశాంతంగా ఊపిరి తీసుకోవడానికో ఉపయోగించవచ్చు. ఉద్యోగంలో ప్రమోషన్ రాకపోతే, దాన్ని నిర్ణయించే యాజమాన్యాన్ని మార్చలేం, కానీ మన నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం, తదుపరి అవకాశం కోసం సిద్ధపడటం మన చేతుల్లోనే ఉంటుంది. ఇలా ప్రతి రంగంలోనూ మార్చగలిగేది, మార్చలేనిది వేరు చేసి చూడగలిగితే, జీవితం భారంగా కాక తేలికగా సాగుతుంది. తెలుగు సాహిత్యంలో వేమన శతకంలో ఈ భావననే ప్రతిబింబించే పద్యం ఒకటి ఉంది:

"గంగ పాఱిపోవు కదలని కొండల
చెంతచేరి యదియు చేటు చేయు
తనకు తానె కీడు తలపెట్టుకొనుటెల్ల
విశ్వదాభిరామ వినురవేమ"

ఈ పద్యం భావం ఏమిటంటే – ఏవి కదలవో, ఏవి మారవో వాటి జోలికి వెళ్లి బాధపడటం వల్ల మనకే నష్టం. ప్రవహించే గంగలా, మనం కూడా మారే విషయాలతో ముందుకు సాగాలి తప్ప, కదలని కొండల్లా ఉండే పరిస్థితులతో పెనుగులాడకూడదు అని వేమన హితవు పలుకుతున్నారు.

చివరగా, జీవితంలో ప్రశాంతత, విజయం రెండూ కావాలంటే ఒక్కటే మార్గం –మార్చలేని వాటిని అంగీకరించడం, మార్చగలిగిన వాటిపై పూర్తి శక్తితో దృష్టి పెట్టడం. ఇదే నిజమైన జ్ఞానం, ఇదే నిజమైన శక్తి!

-మహాదేవ

---

## ప్రతి పల్లెకూ చేరని ఫైబర్ బాట!

గ్రామ పరిపాలనలో వేగం, పారదర్శకత పెంచడంలో డిజిటల్ మౌలిక సదుపాయాలదే కీలక పాత్ర. దేశ జనాభాలో 90 కోట్ల మంది గ్రామాల్లోనే నివసిస్తున్న నేపథ్యంలో, పంచాయతీలను కంప్యూటరీకరించే ప్రయత్నాలు వేగం పుంజుకుంటున్నాయి. అయితే పంజాబ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బిహార్ సహా పలు రాష్ట్రాల్లో వేలాది పంచాయతీలకు ఇప్పటికీ కంప్యూటర్లే లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ లోటు పూడ్చేందుకు కేంద్రం 'దాన్‌వీర' పథకాన్ని తీసుకురాగా, 2.18 లక్షల పంచాయతీలకు ఫైబర్ కనెక్టివిటీ అందించిన 'భారత్‌నెట్' మూడో దశ ఇంకా కొనసాగుతోంది. అయితే నిదానమైన నెట్ వేగం, తెగిపోయే కేబుళ్లు, విద్యుత్ కోతలు లక్ష్య సాధనకు అడ్డంకిగా మారుతున్నాయి. గ్రామాల్లో ప్రతి వందమందికి 48.31 ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్లు ఉంటే, నగరాల్లో ఇది 126.80గా ఉండటం డిజిటల్ విభజనకు అద్దం పడుతోంది. క్షేత్రస్థాయిలో మౌలిక వసతుల కల్పన, నిర్వహణపై ప్రభుత్వాలు నిర్దిష్ట కార్యాచరణ చేపడితేనే గ్రామీణ భారతం నిజమైన డిజిటల్ యుగంలోకి అడుగుపెడుతుంది.





గ్రామ పరిపాలన వేగవంతం కావాలన్నా, పారదర్శకత పెరగాలన్నా డిజిటల్ మౌలిక సదుపాయాలే కీలకం. ప్రభుత్వాలు, ప్రజల మధ్య నేరుగా అనుసంధానానికి ఇవే బలమైన వారధిగా మారుతున్నాయి. దేశ జనాభాలో దాదాపు 90 కోట్లమంది ఇప్పటికీ గ్రామాల్లోనే జీవిస్తున్న నేపథ్యంలో, ఆధునిక సాంకేతికతను పల్లెల వరకూ సమర్థంగా విస్తరించినప్పుడే వికసిత భారత్ లక్ష్యం సాకారమవుతుంది. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ పంచాయతీలు, ఈ–గ్రామ్‌స్వరాజ్ వంటి పథకాలకు శ్రీకారం చుట్టాయి. పంచాయతీ కార్యాలయాల్లో అధికారిక వ్యవహారాలన్నింటినీ కంప్యూటరీకరించడం ఇందులో ప్రధాన లక్ష్యం. దీనివల్ల ధ్రువీకరణ పత్రాల జారీ, పన్నుల వసూలు, ఆస్తుల నమోదు, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, నిధుల వినియోగ పర్యవేక్షణ వంటి పనులు వేగవంతమై, ప్రజలకు అనవసర తిరుగుళ్లు, ఖర్చులు తప్పుతున్నాయి. గతంలో ఒక సాధారణ ధ్రువీకరణ పత్రం కోసం రోజుల తరబడి పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు కంప్యూటరీకరణ జరిగిన చోట్ల ఇవి కొన్ని నిమిషాల్లోనే పూర్తవుతున్నాయి. అయితే వాస్తవ పరిస్థితి చూస్తే, దేశవ్యాప్తంగా వేలాది పంచాయతీల్లో నేటికీ కంప్యూటర్లే లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగించే అంశం. పంజాబ్‌లో కేవలం రెండు శాతం పంచాయతీల్లోనే కంప్యూటర్లు ఉండగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, హరియాణా వంటి రాష్ట్రాల్లోనూ ఇదే దుస్థితి. ఇలాంటి పంచాయతీల్లో ఇప్పటికీ కాగితం రిజిస్టర్లపైనే లావాదేవీలు నమోదు చేయాల్సి వస్తోంది, దీనివల్ల లెక్కల్లో తప్పులు, జాప్యాలు, పారదర్శకత లోపం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ లోటును పూడ్చేందుకు కేంద్రం ఇటీవల 'దాన్‌వీర' పథకాన్ని తెరపైకి తెచ్చింది. దాతృత్వం చూపే వ్యక్తులు, సంస్థలు నేరుగా పంచాయతీలకు కంప్యూటర్లు అందించేలా ఈ పథకం అవకాశం కల్పిస్తోంది. గ్రామీణాభివృద్ధిపై నిజాయితీ ఉన్నవారు దీనిలో భాగస్వాములైతే, పల్లె ప్రగతికి కొత్త ఊపు రావొచ్చు.

కేంద్ర పంచాయతీరాజ్ శాఖ గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా 2.69 లక్షల గ్రామ పంచాయతీలు, సంప్రదాయ స్థానిక సంస్థల్లో ఇప్పటివరకూ 2.18 లక్షలకు పైగా ఆప్టికల్ ఫైబర్ కేబుల్‌తో సేవలకు సిద్ధమయ్యాయి. రూ.1.39 లక్ష కోట్లతో చేపట్టిన 'సవరించిన భారత్‌నెట్' మూడో దశకింద, మిగిలిన 2.65 లక్షల పంచాయతీలకు, 3.8 లక్షల పంచాయతీయేతర గ్రామాలకు డిమాండ్ ఆధారంగా ఫైబర్ కనెక్టివిటీ కల్పించే ప్రణాళిక సిద్ధమైంది. 1.5 కోట్ల గ్రామీణ ఫైబర్ కనెక్షన్లకు ప్రోత్సాహకాలు కూడా ఇందులో భాగంగా ఉన్నాయి. కానీ నిదానమైన నెట్ వేగం, తెగిపోయే కేబుళ్లను వెంటనే బాగు చేయకపోవడం, తరచూ విద్యుత్ కోతలు వంటివి ఈ లక్ష్యాల సాధనకు అడ్డంకిగా మారుతున్నాయి. కొన్నిచోట్ల ఫైబర్ కేబుల్ వేసినా, స్థానిక నిర్వహణ సిబ్బంది కొరత వల్ల నెలల తరబడి రిపేర్లు జరగకపోవడం రైతులు, విద్యార్థులు అనుభవంలోకి వస్తున్న ఇబ్బందుల్లో ఒకటి. జూన్ 2026 నాటికి 43,908 కిలోమీటర్ల ఫైబర్ కేబుల్ వేయగా, 13,494 పంచాయతీలు అప్‌గ్రేడ్ అయినట్టు కేంద్రం వెల్లడించింది. ఫలితంగా గ్రామీణ–పట్టణ డిజిటల్ అంతరం ఇంకా పూర్తిగా తగ్గకపోవడం, అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరకుండా అడ్డుపడుతోంది. పీఎం–వానీ పథకం కింద 4.09 లక్షలకు పైగా పబ్లిక్ వైఫై హాట్‌స్పాట్‌లను ఏర్పాటు చేసినా, 'కామన్ సర్వీస్ సెంటర్లు', 'డిజిటల్ ఇండియా' వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ డిజిటల్ అక్షరాస్యత పెంచే ప్రయత్నాలు కొనసాగుతున్నా, మౌలిక సదుపాయాల కొరతే వాటి ఫలితాలను పరిమితం చేస్తోంది. అంతేకాకుండా, నెట్‌వర్క్ ఉన్నా వాడకంపై సరైన అవగాహన లేకపోవడం వల్ల, ముఖ్యంగా వృద్ధులు, మహిళల్లో డిజిటల్ సేవలను వినియోగించుకోవడంలో వెనుకబాటుతనం స్పష్టంగా కనిపిస్తోంది.

గణాంకాలు ఈ అంతరాన్ని మరింత స్పష్టంగా చాటుతున్నాయి. నేషనల్ బ్రాడ్‌బ్యాండ్ మిషన్ 2.0 ప్రకారం, గ్రామాల్లో ప్రతి వంద మందికి సగటున 48.31 ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్లు మాత్రమే ఉండగా, పట్టణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 126.80గా నమోదవుతోంది. గ్రామీణ–నగర భారతాల మధ్య నెలకొన్న డిజిటల్ విభజనకు ఇది స్పష్టమైన నిదర్శనం. భారత్‌నెట్ కింద 13.93 లక్షల ఇళ్లకు స్థిర ఫైబర్ కనెక్షన్లు ఇచ్చినా, గందరగోళంగా ఉండే టారిఫ్‌లు, పదేపదే తలెత్తే సాంకేతిక సమస్యలు పథకం పూర్తి ప్రయోజనం అందడానికి అడ్డంకిగా నిలుస్తున్నాయి.

పల్లెల్లో డిజిటల్ సేవలు పూర్తిస్థాయిలో విస్తరిస్తే కలిగే ప్రయోజనాలు అనేకం. పింఛన్లు, రాయితీలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి చేరి మధ్యవర్తుల జోక్యం, అవినీతి అవకాశాలు తగ్గుతాయి. ఆన్‌లైన్ తరగతులు, ఈ–లెర్నింగ్ వేదికల ద్వారా గ్రామీణ విద్యార్థుల సామర్థ్యాలు నగర విద్యార్థులతో సమానంగా మెరుగుపడతాయి. రైతులకు పంటల సంరక్షణ, ఆధునిక సాగు పద్ధతులపై నిపుణుల సలహాలు నేరుగా చేరి, వాతావరణ సూచనలు, మార్కెట్ ధరల సమాచారం క్షణాల్లో అందుతాయి. దళారుల ప్రమేయం లేకుండా డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌లతో అనుసంధానమై రైతులు తమ ఉత్పత్తులను లాభసాటి ధరలకు నేరుగా విక్రయించుకోగలుగుతారు. గ్రామీణ చిన్న వ్యాపారులు, చేతివృత్తుల వారు కూడా డిజిటల్ చెల్లింపు వ్యవస్థలతో అనుసంధానమైతే, తమ ఉత్పత్తులకు నగర మార్కెట్లలోనూ గుర్తింపు, డిమాండ్ పెంచుకునే అవకాశం లభిస్తుంది. ఇవన్నీ సాకారం కావాలంటే కేవలం పథకాల ప్రకటనలతో సరిపోదు. క్షేత్రస్థాయిలో మౌలిక వసతుల కల్పన, నిర్వహణ, డిజిటల్ అక్షరాస్యత శిక్షణలపై ప్రభుత్వాలు నిర్దిష్ట కాలపరిమితితో కూడిన కార్యాచరణ చేపట్టాలి. స్థానిక సంస్థలకు మరిన్ని నిధులు, సాంకేతిక సిబ్బందిని కేటాయించి, నిర్వహణ బాధ్యతను జవాబుదారీతనంతో అప్పగించడం కూడా ఇందులో భాగం కావాలి. అప్పుడే గ్రామీణ భారతం నిజమైన అర్థంలో డిజిటల్ యుగంలోకి అడుగుపెడుతుంది, అభివృద్ధి ఫలాలు అట్టడుగు వర్గాల వరకూ చేరతాయి. ■

---



సింహాన్ని 'మృగరాజు' అని బలం చూసి మాత్రమే కాదు, దాని నిర్ణయాల్లోని కచ్చితత్వాన్ని లెక్కించి కూడా అంటాం. మందలో సోమరిగా ఉండే ఏ సింహాన్నీ మరో సింహం సహించదు, ఎంతటి విధేయత చూపినా వదిలేయడానికి వెనుకాడదు. నాయకత్వమంటే అందరినీ మెప్పించడం కాదు, సరైన వారిని ఎంచుకుని ముందుకు తీసుకెళ్లడం. విధేయత ఒక్కటే అర్హత కాదు, సామర్థ్యం, నిబద్ధత కూడా అంతే ముఖ్యం. కఠినమైన నిర్ణయాలు తీసుకోగలిగినప్పుడే బృందం బలంగా నిలుస్తుంది, నాయకత్వం నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుంది.

-మహాదేవ

---

### వింతల్లో వింతలు

## మెరుపు స్క్వీజీ వీరుడు



ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ కిటికీలు తుడిచే నిపుణులు ప్రతి ఏటా లండన్‌లో సమావేశమై, "వరల్డ్ విండో క్లీనింగ్ వరల్డ్ కప్" కోసం పోటీ పడతారు. కిటికీలు తుడవడం సాధారణంగా అందరూ చేయగలిగే పనిలా అనిపించినా, ఈ పోటీలో గెలవాలంటే మాత్రం కఠోర శిక్షణ తప్పనిసరి. 71 ఏళ్ల టెర్రీ బరోస్ ఈ క్రీడలో దిగ్గజంగా పేరొందారు. 2009లో కేవలం 9.14 సెకన్లలో మూడు కిటికీలను ఏ మరకా లేకుండా శుభ్రం చేసి ప్రపంచ రికార్డు సృష్టించారు, ఇప్పటికీ అది అలానే నిలిచి ఉంది. పోటీదారులకు ప్రామాణిక స్క్వీజీ, టీ–బార్ అప్లికేటర్, బకెట్ నీళ్లు, డిటర్జెంట్ ఇచ్చి, మూడు కిటికీలను వేగంగా, పరిశుభ్రంగా తుడవమని చెబుతారు. ముగ్గురు న్యాయనిర్ణేతలు సూక్ష్మంగా గమనిస్తూ, ప్రతి మరక లేదా చుక్కకు అర సెకను, మందపాటి చారలకు ఒక సెకను జోడిస్తారు. వేగం ముఖ్యమే అయినా, శుభ్రత లేకపోతే గెలుపు దక్కదు. విజేతకు వెయ్యి నగదు బహుమతితో పాటు, తోటి నిపుణుల మధ్య గర్వించదగ్గ గుర్తింపు లభిస్తుంది!



# డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు చేసే కొబ్బరినూనె.. ఎందుకంటే..?

డయాబెటిస్ అనేది ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనేక మందిని ఇబ్బందులకు గురి చేస్తోంది. దీని బారిన పడుతున్న వారి సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది పెరుగుతూనే ఉంది. ముఖ్యంగా యుక్త వయస్సులో ఉన్నవారు అధిక శాతం మంది టైప్ 2 డయాబెటిస్ బారిన పడుతున్నారు. అస్తవ్యస్తమైన జీవన శైలి ఈ వ్యాధి వచ్చేందుకు ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. ఆహారం విషయంలో చాలా మంది తగు జాగ్రత్తలు పాటించడం లేదని, దీని వల్లే టైప్ 2 డయాబెటిస్ వస్తుందని అంటున్నారు. డయాబెటిస్ వచ్చిన వారు ఆహారం విషయంలో అనేక జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. లేదంటే వ్యాధి మరింత ముదిరే ప్రమాదం ఉంటుంది. ఆహారంలో పిండి పదార్థాలు, చక్కెరలు తీసుకోవడం పూర్తిగా తగ్గించాలి. లేదా మానేస్తే మంచిది. ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను తీసుకుంటే మేలు జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

**రోజూ ఇలా తీసుకోవాలి..**

డయాబెటిస్ ఉన్నవారు పిండి పదార్థాలు, చక్కెర అధికంగా ఉండే ఆహారాలను తినడం వల్ల శరీరంలో కొవ్వు నిల్వలు పేరుకుపోతాయి. దీంతో ఇన్సులిన్ నిరోధకత మరింత పెరుగుతుంది. దీని వల్ల షుగర్ మరింత ఎక్కువవుతుంది. కనుక ఆయా ఆహారాలను తీసుకోవడం పూర్తిగా తగ్గించాల్సి ఉంటుంది. ఫైబర్ ఉండే ఆహారాలను తినాలి. దీని వల్ల షుగర్ లెవల్స్ నెమ్మదిగా పెరుగుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. అయితే డయాబెటిస్ ఉన్నవారు కొబ్బరినూనెను ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. కొబ్బరినూనె డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు చేస్తుందని అంటున్నారు. కొబ్బరినూనెను రోజూ వంట నూనెగా ఉపయోగించవచ్చు. లేదా రాత్రి పూట నిద్రకు ముందు ఒక టీస్పూన్ మోతాదులో తీసుకోవచ్చు. దీని వల్ల డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో ఉపయోగం ఉంటుంది.

**ఇన్సులిన్ నిరోధకతకు..**

డయాబెటిస్ ఉన్నవారు రోజూ కొబ్బరినూనెను తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచవచ్చు. దీంతో ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది. శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారికి సహజంగానే అజీర్తి సమస్య ఉంటుంది. ఆహారం జీర్ణమవడం ఆలస్యం అవుతుంది. కానీ కొబ్బరినూనెను తీసుకుంటే ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి ఉండదు. అలాగే షుగర్ ఉంటే మలబద్దకం కూడా ఇబ్బంది పెడుతుంది. కానీ కొబ్బరినూనెను తీసుకోవడం వల్ల మలబద్దకం అన్న మాటే ఉండదు. రోజూ ఉదయం సుఖంగా విరేచనం అవుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఆహారంలోని పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది.

**ఇన్‌ఫెక్షన్లకు చెక్..**

కొబ్బరినూనెను సేవించడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. దీని వల్ల షుగర్ లెవల్స్‌ను నియంత్రణలో ఉంచుకోవచ్చు. కొబ్బరినూనె యాంటీ మైక్రోబియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ గుణాలను కలిగి ఉంటుంది. కనుక ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తుంది. డయాబెటిస్ ఉన్నవారికి తరచూ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. కనుక వారు కొబ్బరినూనెను తీసుకుంటే ఇన్‌ఫెక్షన్‌లకు చెక్ పెట్టవచ్చు. ముఖ్యంగా చర్మంపై, జననావయవాల్లో వచ్చే ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. కొబ్బరినూనెను తీసుకోవడం వల్ల చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. చర్మం పొడిబారకుండా చూస్తుంది. చర్మం కాంతివంతంగా కనిపించేలా చేస్తుంది. అలాగే శిరోజాలు దృఢంగా ఆరోగ్యంగా ఉంటాయి. జుట్టు రాలడం తగ్గిపోతుంది. డయాబెటిస్ ఉన్నవారు కొబ్బరినూనెను తీసుకుంటే ఇలా అనేక రకాలుగా లాభాలను పొందవచ్చు.

# ఆస్తమా ఉందా.. అయితే ఈ చిట్కాలను పాటించండి.. ఉపశమనం లభిస్తుంది..!



చలికాలంలో లేదా ఇతర సమయాల్లో వాతావరణం చల్లగా ఉన్నప్పుడు చాలా మందికి శ్వాసకోశ సమస్యలు వస్తుంటాయి. ముఖ్యంగా దగ్గు, జలుబు వంటి సమస్యల బారిన పడుతుంటారు. అయితే ఇవి సహజంగా వచ్చేవే. కానీ ఆస్తమా ఉన్న వారికి మాత్రం సీజన్లు మారినప్పుడు లేదా చల్లని వాతావరణం ఉన్నప్పుడు తీవ్రంగా ఇబ్బంది కలుగుతుంది. ఆస్తమాతో అల్లాడిపోతారు. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది. అయితే ఆస్తమా ఉన్నవారు డాక్టర్ ఇచ్చిన మందులను క్రమం తప్పకుండా వాడాలి. అలాగే ఆహారం విషయంలోనూ అనేక జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. అయితే ఆస్తమా ఉన్నవారు పలు ఇంటి చిట్కాలను పాటించడం వల్ల సమస్య నుంచి ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. అలాగే శ్వాస నాళాలు క్లియర్‌గా మారుతాయి. ఊపిరి సరిగ్గా పీల్చుకోగలుగుతారు.

**పసుపు..**

ఆస్తమా ఉన్నవారికి పసుపు ఎంతో మేలు చేస్తుంది. పసుపులో కర్క్యుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఆస్తమా నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. అందుకుగాను రోజూ రాత్రి పూట ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలలో కొద్దిగా పసుపును కలుపుకుని తాగాలి. ఇలా రోజూ చేయాలి. దీని వల్ల ఆస్తమా లక్షణాల నుంచి ఉపశమనం పొందవచ్చు. అలాగే ఆహారం విషయానికి వస్తే ఫ్లేవనాయిడ్స్, విటమిన్లు సి, డి, యాంటీ ఆక్సిడెంట్లు ఉండే ఆహారాలను తీసుకోవాలి. దీని వల్ల కూడా ఆస్తమా ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఈ ఆహారాల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల వీటిని తీసుకుంటే శ్వాస నాళాల వాపులు తగ్గిపోతాయి. దీని వల్ల శ్వాస నాళాలు క్లియర్‌గా మారి ఊపిరి సరిగ్గా తీసుకోగలుగుతారు. ఇందుకు గాను నారింజ, నిమ్మ, కివీ, ఆలుగడ్డలు, పాలు, చేపలు, గుడ్లు, లివర్, జున్ను, తృణ ధాన్యాలు, సిట్రస్ పండ్లను తీసుకోవాల్సి ఉంటుంది.

**అల్లం..**

ఆస్తమా ఉన్నవారు టీ, కాఫీలను తరచూ తాగుతుండాలి. చక్కెర లేకుండా బ్లాక్ టీ లేదా బ్లాక్ కాఫీ తాగడం వల్ల ఉపశమనం లభిస్తుంది. వీటిల్లో అధికంగా ఉండే కెఫీన్ ఆస్తమా లక్షణాల నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది. అలాగే శ్వాసనాళాలపై పడే ఒత్తిడి తగ్గిపోతుంది. దీంతో శ్వాస నాళాల వాపులు తగ్గిపోతాయి. అయితే కెఫీన్‌ను మరీ అధికంగా తీసుకోకూడదు. రోజుకు 3 లేదా కప్పుల టీ లేదా కాఫీ తాగాలి. అంతకు మించి తాగకూడదు. ఇక ఆస్తమాను తగ్గించుకునేందుకు అల్లం కూడా బాగానే పనిచేస్తుంది. ఇది గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫాన్ని తొలగిస్తుంది. శ్వాస నాళాలను వెడల్పుగా చేస్తుంది. దీని వల్ల శ్వాస సరిగ్గా లభిస్తుంది. ఆస్తమా నుంచి ఉపశమనం లభిస్తుంది. అల్లం రసాన్ని రోజూ రెండు పూటలా పూటకు ఒక టీస్పూన్ మోతాదులో తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.

**యూకలిప్టస్ ఆయిల్..**

యూకలిప్టస్ ఆయిల్‌ను వాడుతున్నా కూడా ఆస్తమా లక్షణాలను తగ్గించుకోవచ్చు. ఇది దీర్ఘకాలిక మంటను తగ్గించడంలో సహాయం చేస్తుంది. శ్వాసనాళాల్లో ఉండే వాపులు తగ్గిపోతాయి. కఫం కరిగిపోతుంది. ఒక ఖర్చీఫ్ మీద కొద్దిగా యూకలిప్టస్ ఆయిల్‌ను వేసి దాన్ని నిద్రించేటప్పుడు ముక్కుకు దగ్గరగా పెట్టుకోవాలి. లేదా మరుగుతున్న నీటిలో కొద్దిగా యూకలిప్టస్ ఆయిల్‌ను వేసి అనంతరం వచ్చే ఆవిరిని బాగా పీల్చాలి. ఇలా చేస్తున్నా కూడా ఉపశమనం లభిస్తుంది. శ్వాస నాళాలు క్లియర్‌గా మారుతాయి. గాలి సరిగ్గా లభిస్తుంది. ఈ విధంగా పలు ఆహారాలను తీసుకుంటూ ఆయా చిట్కాలను పాటిస్తుంటే ఆస్తమా లక్షణాలను చాలా వరకు తగ్గించుకుని ఉపశమనం పొందవచ్చు.

# లావు ఉన్న వారికి నిమ్మ తొక్కలు ఓ వరం.. ఎలా అంటే?

మనమందరం నిమ్మకాయలను వివిధ సందర్భాల్లో ఆహారంలో వినియోగిస్తుంటాము. అయితే ఎక్కువ మంది నిమ్మ రసాన్ని వాడుకుని.. దాని తొక్కలను పడేస్తుంటారు. అలా తొక్కే కదా అని పడేస్తే.. మనం చాలా నష్టపోయినట్లే అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా అధిక బరువు ఉన్న వాళ్లకు ఈ నిమ్మ తొక్కలు వరం లాంటివి. వాటిని సరిగ్గా వినియోగించుకుంటే.. బాడీ ఫ్యాట్ తగ్గి.. నాజూగ్గా మారవచ్చు. మరి.. నిమ్మ తొక్కలను ఎలా ఉపయోగిస్తే.. అధిక బరువు తగ్గొచ్చు ఇప్పుడు తెలుసుకుందాం..



నిమ్మ జ్యూస్ లో కంటే తొక్కలోనే ఎక్కువ పోషకాలు ఉంటాయని చాలా మందికి తెలియదు. ఈ తొక్కలు ఒక న్యూట్రియెంట్ పవర్ హౌస్ లాంటవి అని నిపుణులు చెబుతున్నారు. ఈ తొక్కలో విటమిన్-సి, డీ-లిమొనెన్, ఫెక్టిన్, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు ఉన్నాయి. దీనిలోని విటమిన్ సీ శరీరంలోని రోగ నిరోధక శక్తిని బూస్ట్ చేస్తుంది. అలానే మన చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి కణాల డ్యామేజ్‌ను విటమిన్-సి ఆపుతుంది. అలానే దీనిలోని ఫైబర్, ఫెక్టిన్ అనేవి జీర్ణ వ్యవస్థకు హెల్ప్ చేస్తాయి. వీటి వల్ల త్వరగా ఆకలి వేయదు. ఫ్లేవనాయిడ్స్, డీ-లిమొనెన్ లు మెటబాలిజంను పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి. బోన్ హెల్త్‌కు కాల్షియం, మెగ్నీషియం బలం ఇస్తాయి.

నిమ్మ తొక్కలో ఉండే డీ-లిమొనెన్ శరీరంలోని కాంపౌండ్ కొవ్వును కరిగించడానికి మెటబాలిజంను మెరుగుపరుస్తుంది. ఈ తొక్కను మన డైలీ లైఫ్ లో చేర్చుకోవడం చాలా ఈజీ. నిమ్మ తొక్కలను బాగా కడిగిన తర్వాత ఎండలో ఉంచి డ్రై చేయాలి. బాగా ఎండిన తర్వాత మిక్సీలో వేసి .. పౌడర్ లా చేయాలి. ఆ పౌడర్ ను రోజూ ఉదయం ఒక గ్లాస్ గోరువెచ్చని నీటిలో కలుపుకొని తాగాలి. అలా రోజూ చేయడం వల్ల.. మనకు తెలియకుండానే బాడీ వెయిట్ తగ్గుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గేందుకు వేలకు వేలు ఖర్చు చేయకుండా నిమ్మ తొక్కలతోనే మార్పు తెచ్చుకోవచ్చు. వాతావరణం మారినప్పుడు వచ్చే వచ్చే జలుబు, దగ్గు లాంటి వాటి నుంచి శరీరం త్వరగా కోలుకునేందుకు నిమ్మ తొక్కలు ఉపయోగపడతాయట.

# పీనట్ బటర్ ఆరోగ్యకరమైందేనా..?

## దీన్ని రోజుకు ఎంత తినాలి..? దీంతో ఎలాంటి లాభాలు కలుగుతాయి..?

మార్కెట్‌లో మనకు అనేక రకాల ఆహారాలు అందుబాటులో ఉన్నాయి. చాలా రకాల ఆహారాలు మనకు ప్రకృతి సహజసిద్ధంగా అందిస్తుంది. కొన్ని రకాల ఆహారాలను మనం తయారు చేసుకుని తింటాం. వాటిల్లో ఆరోగ్యకరమైనవి, అనారోగ్యకరమైనవి కూడా ఉంటాయి. అయితే ఆరోగ్యకరమైన ఆహారాల విషయానికి వస్తే వాటిల్లో పీనట్ బటర్ కూడా ఒకటి. పల్లీల నుంచి దీన్ని తయారు చేస్తారు. సాధారణంగా చాలా మంది దీన్ని అనారోగ్యకరమైన ఆహారం అని భావిస్తారు. ఎందుకంటే ఇందులో కొవ్వులు, ప్రోటీన్లు అధికంగా ఉంటాయి కనుక దీన్ని తినకూడదని, ప్రమాదమని అనుకుంటారు. కానీ ఇందులో నిజం లేదు. ఎందుకంటే పీనట్ బటర్ వాస్తవానికి ఆరోగ్యకరమైనదే. కానీ ఇందులో చక్కెరలు, అనారోగ్యకరమైన కొవ్వులు, ఉప్పు వంటి ఆహారాలను కలపకుండా తయారు చేసింది అయి ఉండాలి. అలాంటి పీనట్ బటర్‌నే మనం తినాల్సి ఉంటుంది. మార్కెట్‌లో చాలా రకాల పీనట్ బటర్ బ్రాండ్లు మనకు లభిస్తున్నాయి. కనుక వాటిని జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

**ప్రోటీన్లు అధికం..**

ఎలాంటి కృత్రిమ పదార్థాలు, చక్కెర, ఉప్పు లాంటి పదార్థాలను కలపకుండా తయారు చేసిన పీనట్ బటర్ అయితేనే మనం ఉపయోగించాలి. అలాంటి పీనట్ బటర్‌ను తింటేనే ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయి. పీనట్ బటర్ మనకు అనేక లాభాలను అందిస్తుంది. ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి మనకు అనేక ప్రయోజనాలను అందిస్తాయి. మాంసాహారం తినని వారికి కావల్సిన ప్రోటీన్లను పీనట్ బటర్ అందిస్తుంది. ఇందులో వృక్ష సంబంధ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి కండరాల కణజాలానికి మరమ్మత్తులు చేస్తాయి. దీని వల్ల కండరాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. శరీరానికి శక్తి లభిస్తుంది. పీనట్ బటర్‌ను తింటే ఆరోగ్యకరమైన కొవ్వులను పొందవచ్చు. ఇందులో మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి మంచి కొవ్వుల జాబితాకు చెందుతాయి. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది.



**కండరాల ఆరోగ్యానికి..**

పీనట్ బటర్‌లో విటమిన్ ఇ అధికంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తుంది. దీని వల్ల క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. విటమిన్ ఇ వల్ల చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పీనట్ బటర్‌ను తింటే అధిక మొత్తంలో మెగ్నీషియం లభిస్తుంది. ఇది కండరాలను దృఢంగా ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. నాడీ మండల వ్యవస్థ చురుగ్గా పనిచేసేలా చేస్తుంది. శరీరంలో శక్తి స్థాయిలను పెంచుతుంది. దీంతో ఉత్సాహంగా ఉంటారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. బద్దకం పోతుంది. నీరసం, అలసట తగ్గుతాయి. పీనట్ బటర్‌లో అనేక రకాల బి విటమిన్లు ఉంటాయి. ముఖ్యంగా విటమిన్ బి3 అధికంగా ఉంటుంది. ఇది మనం తిన్న ఆహారం సులభంగా శక్తిగా మారేందుకు దోహదం చేస్తుంది. దీని వల్ల శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి.

**హైబీపీ ఉన్నవారికి..**

పీనట్ బటర్‌లో అధికంగా ఉండే పొటాషియం బీపీని నియంత్రిస్తుంది. శరీరంలో సోడియం స్థాయిలను తగ్గించి బీపీ అదుపులో ఉండేలా చేస్తుంది. కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుతుంది. పీనట్ బటర్‌ను తింటే జింక్ కూడా అధిక మొత్తంలో లభిస్తుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీని వల్ల సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. ఈ విధంగా పీనట్ బటర్ మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అయితే మార్కెట్‌లో ఏ పీనట్ బటర్ పడితే దాన్ని కొనకూడదు. కృత్రిమ పదార్థాలు లేని పీనట్ బటర్‌ను కొని వాడితే మేలు జరుగుతుంది. ఇక దీన్ని రోజుకు 2 టేబుల్ స్పూన్లకు మించి తినకూడదు. అలర్జీలు ఉన్నవారు పీనట్ బటర్‌ను తినకూడదు. ఇలా జాగ్రత్తలను పాటిస్తూ దీన్ని తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.

## సొంత జట్టుతో కొట్లాట.. పంజాబ్ కింగ్స్ స్టార్ ప్లేయర్ సంచలన నిర్ణయం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ లో రచ్చ చేసిన పంజాబ్ కింగ్స్ ఆల్‌రౌండర్ శశాంక్ సింగ్ సొంత స్టేట్ టీమ్‌తోనే ఇప్పుడు లొల్లి పెట్టుకొని గట్టి నిర్ణయం తీసుకున్నాడు. ఛత్తీస్‌గఢ్ స్టేట్ క్రికెట్ సంఘం ) తనకు అస్సలు సపోర్ట్ ఇయ్యలేదని, ఏమాత్రం చెప్పకుండా టీమ్ నుంచి పక్కనబెట్టిందని ఆరోపించాడు. అందుకే ఆ టీమ్‌ను వదిలేసి, వచ్చే 2026-27 డొమెస్టిక్ సీజన్ నుంచి పాండిచ్చేరి తరఫున ఆడబోతున్నట్టు చెప్పేసిండు. దీనికి సంబంధించి ఛత్తీస్‌గఢ్ బోర్డు నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ ) కూడా తీసుకున్నాడు.

**గాయపడితే పట్టించుకోలే.. అడిగితే అసలు జవాబే లేదు:**

శశాంక్ సింగ్ మాట్లాడుతూ.. గత సీజన్‌లో నాకు భుజం, వేలికి తీవ్ర గాయాలైనయి. ఆ సమయంలో ఛత్తీస్‌గఢ్ క్రికెట్ అసోసియేషన్ నన్ను అస్సలు పట్టించుకోలే, సపోర్ట్ కూడా చేయలే.. గాయం తగ్గినంక కూడా ఛత్తీస్‌గఢ్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ (జబూరా 2026) ప్లేయర్ల లిస్టులకెల్లి నా పేరు తీసేసింద్రు. బెంగళూరుల జరిగిన ప్రీ-సీజన్ క్యాంప్‌కి కూడా నన్ను పిలవలే.. నా పేరు ఎందుకు తీసేసింద్రు? అని అడిగితే అసోసియేషన్ వాళ్లు జవాబు చెప్పలేదని ఆవేదన వ్యక్తం చేసిండు.

**నేను ఐపీఎల్ మాత్రమే ఆడతాననడం అబద్ధం:**

తాను ఐపీఎల్ ఒక్కటే ఆడడానికే ఇంట్రెస్ట్ చూపిస్తున్నానని, డొమెస్టిక్ మ్యాచ్‌లను లైట్ తీసుకుంటున్నానని వచ్చిన వార్తలను శశాంక్ సింగ్ తీవ్రంగా ఖండించాడు. నేను డొమెస్టిక్ మ్యాచ్‌లు ఆడకుండా కేవలం ఐపీఎల్ ఆడటానికే చూడట్లే.. గత సీజన్ (2023-24 ) లోనే డొమెస్టిక్ వైట్ బాల్ మ్యాచ్‌లలో బెస్ట్ ఆల్‌రౌండర్ ప్రదర్శన ఇచ్చినందుకు బీసీసీఐ నాకే ప్రతిష్టాత్మకమైన లాలా అమర్‌నాథ్ అవార్డు ఇచ్చింది. ఇండియాలోనే బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిచినా నేను డొమెస్టిక్ ఆడా అనడం ఏంది? అని ప్రశ్నించాడు.

**డొమెస్టిక్, ఐపీఎల్‌లో మాస్ రచ్చ:**

గత కొంతకాలంగా దేశవాళీ మ్యాచ్‌లలోనూ, ఐపీఎల్‌లోనూ శశాంక్ కిర్రాక్ పర్ఫార్మెన్స్ ఇస్తున్నాడు.

2024--25 డొమెస్టిక్ రికార్డు: విజయ్ హజారే ట్రోఫీలో 7 మ్యాచ్‌లలోనే 450 రన్స్, 11 వికెట్లు తీసిండు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 7 మ్యాచ్‌లలో 188 రన్స్ కొట్టిండు.

ఐపీఎల్ 2025లో విధ్వంసం: పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ 2025 ఫైనల్‌కి పోవడంలో శశాంక్ కీలక పాత్ర పోషించాడు. 153.51 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 350 రన్స్ కొట్టిండు. బెంగళూరుతో జరిగిన ఫైనల్లోనైతే కేవలం 30 బంతుల్లో 61 రన్స్ (నాటౌట్)తో చెలరేగాడు.

**పాండిచ్చేరితో కొత్త ఇన్నింగ్స్:**

వచ్చే సీజన్ నుంచి రెడ్-బాల్ (రంజీ) క్రికెట్‌కి కొద్దిగా గ్యాప్ ఇచ్చి, వైట్-బాల్ (ర20, వాణ×) ఫార్మాట్‌పైనే పూర్తి ఫోకస్ పెట్టాలని శశాంక్ సింగ్ ఫిక్స్ అయ్యాడు. టీ20ల్లో తన 4 ఓవర్ల కోటా పూర్తిగా బౌలింగ్ వేసే పక్కా ఆల్‌రౌండర్‌గా నిలబడాలనేదే తన మెయిన్ గోల్ అని చెప్పిండు. 2018ల ముంబైని వదిలేసి మంచి ఛాన్స్‌ల కోసం ఛత్తీస్‌గఢ్‌కు వచ్చిన శశాంక్, ఇప్పుడు ఆ అసోసియేషన్‌తో గొడవపడి బయటికొచ్చి పాండిచ్చేరి జట్టుతో తన డొమెస్టిక్ కెరీర్‌లో కొత్త ఇన్నింగ్స్ స్టార్ట్ చేయబోతున్నాడు.

## భారత జట్టుతో నా ఐదేళ్ల ప్రయాణం ముగిసింది.. ఈ జ్ఞాపకాలని జీవితంలో మర్చిపోలేను



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టు సక్సెస్‌లో కీలక పాత్ర పోషించిన ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్ తన పదవీకాలానికి ముగింపు పలికారు. జింబాబ్వే పర్యటనతో ఆయన కాంట్రాక్ట్ పూర్తి కావడంతో, టీమిండియాతో ఐదేళ్ల అనుబంధానికి తెరపడింది. ఈ నేపథ్యంలో ఈరోజు (ఆగస్టు 3న, సోమవారం) ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగ లేఖను విడుదల చేశారు. జట్టుతో తన ప్రయాణం ఎంతో గొప్పగా కొనసాగింది, ఆ జ్ఞాపకాలను ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు. నవంబర్ 2021లో భారత ఫీల్డింగ్ కోచుగా బాధ్యతలు చేపట్టిన దిలీప్.. జింబాబ్వే పర్యటనతో తన కాంట్రాక్ట్ ముగియడంతో జట్టు నుంచి తప్పుకున్నారు. ఆయన స్థానంలో శుభదీప్ ఘోష్ కొత్త ఫీల్డింగ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా దిలీప్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. ఐదేళ్లు ఎంతో అర్థవంతమైన ఈ ప్రయాణానికి సరైన మాటలు దొరకడం లేదు.. నేను ఈ సెటప్‌లోకి అడుగు పెట్టినప్పుడు ప్రతిరోజూ నా వంతుగా 100 శాతం ఇవ్వాలనే ఒక్కటే లక్ష్యంతో వచ్చానని వెల్లడించారు.

**ప్రత్యేక ఆకర్షణగా ఫీల్డింగ్ మెడల్ ట్రెండ్:**

డ్రెస్సింగ్ రూమ్‌లో మ్యాచ్ తర్వాత ఉత్తమ ఫీల్డర్‌కు ఇచ్చే ఫీల్డింగ్ మెడల్ ఆచారాన్ని టి. దిలీప్ ప్రారంభించారు. ఇది ఆటగాళ్లలో పోటీతత్వాన్ని పెంచడంతో పాటు జట్టులో ఉత్సాహాన్ని నింపింది. ముఖ్యంగా 2023 వన్డే ప్రపంచకప్ సమయంలో ఈ సంప్రదాయం ఎంతగానో ప్రాచుర్యం పొందింది. ఈ అనుభూతిని గుర్తు చేసుకుంటూ.. ఫీల్డింగ్ మెడల్ నా హృదయంలో ఎప్పటికీ ప్రత్యేక స్థానంలో ఉంటుంది. డ్రెస్సింగ్ రూమ్‌లో అది సృష్టించిన ఉత్సాహం, ఆటగాళ్లు దానికి ఇచ్చిన విలువ ఎప్పటికీ మర్చిపోలేనని చెప్పుకొచ్చాడు.

**అరుదైన విజయాలకు వేదిక:**

తన ఐదేళ్ల పదవీకాలంలో టీమిండియా సాధించిన అద్భుత విజయాలను దిలీప్ గర్వంగా గుర్తు చేసుకున్నారు.

2024 , 2026 ఐసీసీ టీ20 ప్రపంచకప్ విజయాలు
2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ గెలుపు,
2023 , 2025 ఆసియా కప్ విజయాలు
2023 ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్, వన్డే ప్రపంచకప్ రన్నరప్స్

**ప్రత్యేక కృతజ్ఞతలు:**

బీసీసీఐతో పాటు తనతో కలిసి పని చేసిన ప్రతి ఒక్కరికీ దిలీప్ ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి దేశానికి సేవ చేసే అవకాశం కల్పించినందుకు బీసీసీఐకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. అలాగే, రాహుల్ ద్రావిడ్, గౌతమ్ గంభీర్‌లు తనపై ఉంచిన నమ్మకానికి ధన్యవాదాలు చెప్పాడు.

ఇక రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్యా, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్‌లతో పని చేయడం తన అదృష్టమన్నారు. ఈ అధ్యాయం ముగిసినా, భారతదేశ జెర్సీని ధరించి దేశానికి సేవ చేసిన ఈ ఐదేళ్లు నా జీవితంలో ఎప్పటికి మరువలేని జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి.. భారత్ మాతా కీ జై! అంటూ తన సందేశాన్ని మాజీ ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్ ముగించాడు.

## భారత జట్టులో వరుస గాయాలతో ఆందోళన.. శ్రీలంక టూర్ తర్వాత బీసీసీఐ రివ్యూ



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక జట్టుతో ఆగస్టు 15వ తేదీ నుంచి జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు సిద్ధమవుతున్న భారత క్రికెట్ జట్టు ప్రస్తుతం తీవ్రమైన గాయాల సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్ట్ ప్రారంభం కానుండగా.. కీలక ఆటగాళ్లు గాయాల కారణంగా దూరమవడం జట్టును తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.

**గాయాల బారిన పడ్డ కీలక ప్లేయర్స్:**

ఇప్పటికే హార్దిక్ పాండ్యా, నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా లాంటి ఆటగాళ్లు గాయాల కారణంగా టీమిండియాకు దూరంగా ఉండగా.. తాజాగా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా కూడా మోకాలి గాయంతో ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. ప్లేయర్స్ వరుస గాయాలు కెప్టెన్, కోచ్‌లకు తుది జట్టును ఎంపిక చేయడంలో తీవ్ర తలనొప్పిగా మారింది.

**ఫిజియో, డాక్టర్లపై బీసీసీఐ నిఘా:**

ఆటగాళ్లు తరచూ గాయ పడుతుండటంపై బీసీసీఐ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. జట్టు ప్రధాన ఫిజియో కమలేశ్ జైన్, డాక్టర్ రిజ్వాన్ ఖాన్ ల పని తీరుపై బోర్డు దృష్టి పెట్టింది. బీసీసీఐ సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్స్ నిపుణుల పాత్రపై కూడా సమీక్ష జరుపుతున్నట్లు సమాచారం. ఒక జట్టులో ప్రతి స్థానానికి తీవ్రమైన పోటీ ఉన్నప్పుడు, ఆటగాళ్లు తమ శరీరాన్ని కష్టపెట్టాల్సి వస్తుంది. ఇక్కడే సపోర్ట్ స్టాఫ్, జశీజు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్లేయర్స్ ను తొందరగా బరిలోకి దింపకుండా అలర్ట్ చేయాలి.. కానీ ప్రస్తుత పరిస్థితి ఇబ్బందికరంగా మారింది, బాధ్యులందరినీ జవాబుదారీగా చేయాలని బీసీసీఐ వర్గాలు పేర్కొంటున్నాయి.

**డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో నిలవాలంటే:**

ప్రస్తుత టెస్ట్ సిరీస్ భారత్‌కు అత్యంత కీలకం కానుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (ఔజ) ఫైనల్ రేసులో నిలవాలంటే.. భారత్ ఆడబోయే తదుపరి 9 టెస్టుల్లో కనీసం 7,8 మ్యాచ్‌ల్లో విజయం సాధించాల్సి ఉంటుంది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని యంగ్ టీమ్ ఈ లంక పర్యటనలో ఎలాంటి ప్రదర్శన కనబరుస్తుందో చూడాల్సి ఉంది.

## టాలీవుడ్ లో లక్కీలేడీగా మారిన మిరాయ్ బ్యూటీ.. ఆ అదృష్టం వరిస్తుందా?







టాలీవుడ్‌కి అశోక వనంలో అర్జున కళ్యాణం' సినిమాతో పరిచయమై, ఆ తర్వాత వచ్చిన 'మిరాయ్' చిత్రంతో మంచి విజయాన్ని అందుకుంది యంగ్ హీరోయిన్ రితిక నాయక్ రెండు వరుస హిట్లతో ఇండస్ట్రీలో లక్కీ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. ఇప్పుడు ఆమె వరుణ్ తేజ్‌తో కలిసి 'కొరియన్ కనకరాజు' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది.. మరి ఈ సినిమాతో ఆమె హ్యాట్రిక్ కొట్టి, అదృష్టాన్ని అందిపుచ్చుకుంటుందా? అటు వరుణ్ తేజ్‌కు కూడా విజయాన్ని అందిస్తుందో లేదో చూడాలి..



**తొలి సినిమాతోనే మంచి గుర్తింపు:**

రితిక నాయక్ తన కెరీర్ ప్రారంభంలోనే సరైన కథను ఎంచుకుంది. 'అశోక వనంలో అర్జున కళ్యాణం' సినిమాలో ఆమె నటనకు, అందానికి మంచి మార్కులు పడ్డాయి. బాక్సాఫీస్ వద్ద కూడా ఈ సినిమా మంచి విజయం సాధించడంతో, అందరి దృష్టి రితికపై పడింది.

**'మిరాయ్'తో దక్కిన మరో ఘనవిజయం:**

మొదటి సినిమా హిట్ అయిన తర్వాత వచ్చిన 'మిరాయ్' మూవీ కూడా భారీ విజయాన్ని అందుకుంది. దీంతో మొదటి రెండు సినిమాలతోనే వరుసగా రెండు హిట్లు తన ఖాతాలో వేసుకుంది రితిక. అలాగే 'హాయ్ నాన్న'లో ఆమె చేసిన చిన్న మెరుపు లాంటి రోల్ కూడా కుర్రకారును బాగా ఆకట్టుకుంది.

**సినిమాల మధ్య పెద్ద గ్యాప్:**

ఇంత మంచి గుర్తింపు వచ్చినా, రితిక వరుసగా సినిమాలు సంతకం చేయకపోవడం కాస్త మైనస్ అనే చెప్పాలి. ఇక ఇండస్ట్రీలో నిలదొక్కుకోవాలంటే ఎప్పుడూ వార్తల్లో, స్క్రీన్ మీద కనిపించడం చాలా అవసరం. ఈ పెద్ద గ్యాప్ వల్ల ఆమె కెరీర్ వేగం కాస్త తగ్గుతోందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

**హ్యాట్రిక్ కొట్టే రేర్ చాన్స్:**

ఇప్పుడు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వస్తున్న 'కొరియన్ కనకరాజు' సినిమాలో రితిక హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమా కూడా హిట్ అయితే, కెరీర్ ప్రారంభంలోనే వరుసగా మూడు హిట్లు కొట్టిన అరుదైన నాయికగా రితిక చరిత్ర సృష్టిస్తుంది. మరి ఆ అదృష్టం ఆమెను వరిస్తుందో లేదో మూవీ రిలీజ్ తో తేలనుంది.

**వరుణ్ తేజ్‌కి లక్ కలిసి వస్తుందా?:**

మరోవైపు, హీరో వరుణ్ తేజ్‌కి ఈ సినిమా విజయం చాలా కీలకం. సరైన హిట్ కోసం చూస్తున్న వరుణ్‌కి, లక్కీ చార్మ్‌గా మారిన రితిక నాయక్ అదృష్టం ఏ మేరకు కలిసివస్తుందో చూడాలి. ఈ కాంబినేషన్ బాక్సాఫీస్ వద్ద ఏ రేంజ్ సక్సెస్ సాధిస్తుందో త్వరలోనే తేలనుంది.మొత్తానికి ఆగస్టు 7న విడుదల కానున్న 'కొరియన్ కనకరాజు' చిత్రం రితిక నాయక్ కెరీర్‌కి చాలా ప్లస్ అయ్యేలా కనిపిస్తోంది. మరి ఈ 'మిరాయ్' బ్యూటీ తన లక్ తో ఇటు తనకు హ్యాట్రిక్ హిట్ ఇస్తూ, అటు వరుణ్ తేజ్‌కు కూడా సక్సెస్ అందిస్తుందో లేదో వేచి చూడాల్సిందే!..

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965